# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

3.4.2026 శుక్రవారం Friday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 252 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana




రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789

## అమెరికా తలవంచే వరకు యుద్ధం ఆగదు

- ఇరాన్ సైన్యం తీవ్ర హెచ్చరిక! మా సామర్థ్యం దెబ్బతినలేదు..
- భారత మిత్రులు సురక్షితమే: ఇరాన్ భరోసా

4

## హర్ముజ్ జలసంధి పునరుద్ధరణకు 40 దేశాల కసరత్తు

### భారత్‌కు ఆహ్వానం!

- బ్రిటన్ నేతృత్వంలో కీలక సమావేశం..
- వర్చువల్‌గా పాల్గొననున్న విదేశాంగ కార్యదర్శి
- చమురు రవాణాకు ఆటంకం కలగకుండా అంతర్జాతీయ ప్రయత్నాలు

4






## ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు

జూన్ 12న తిరిగి ప్రారంభం కానున్న పాఠశాలలు

3

## మల్టీప్లెక్స్ బాటలో సింగిల్ స్క్రీన్లు

### నేటి నుంచే పర్సంటేజ్ విధానం అమలు

3

- హైదరాబాద్‌లోని 23 థియేటర్ల కీలక నిర్ణయం
- మనుగడ కోసమేనన్న ఎగ్జిబిటర్లు

తెలంగాణ ఎగ్జిబిటర్లు చలనచిత్ర ప్రదర్శన రంగంలో కీలక మార్పుకు శ్రీకారం చుట్టారు. మల్టీప్లెక్స్ తరహాలో ఇకపై పర్సంటేజీ విధానంలోనే సినిమాలను ప్రదర్శించాలని హైదరాబాద్‌లోని 23 సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఏప్రిల్ 3 నుంచి ఈ కొత్త నిబంధన అమల్లోకి రానుంది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధికారిక ప్రకటన విడుదల చేసింది.





## చేనేత కార్మికుల పొట్ట కొడుతున్న ప్రభుత్వం

- యూనిఫాం ఆర్డర్ల రద్దుపై కవిత తీవ్ర ఆగ్రహం

.. వివరాలు 2లో

## దోమతెర కప్పుకుని ఎమ్మెల్యే నిరసన



2

అసెంబ్లీలో ప్రతిపక్ష నేతలు టెర్రరిస్టుల్లా ప్రవర్తించారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వరుస ఎన్నికల్లో ఓడిపోయినా వారికి ఇంకా జ్ఞానోదయం కాలేదని విమర్శించారు. గత ప్రభుత్వం అరాచకాలకు పాల్పడితే, ఇందిరమ్మ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోందని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని మిఠాయిపల్లిలో గురువారం జరిగిన గ్రామసభలో 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.



# టెర్రరిస్టుల్లా ప్రతిపక్షాల తీరు

### ఎన్నికల్లో ఓడినా వాళ్లకు జ్ఞానోదయం కాలేదు



### విపక్షాలపై మంత్రి పొంగులేటి తీవ్ర ధ్వజం

- 45 రోజుల తర్వాత జిల్లాకో మండలంలో 'భూభారతి'
- ప్రతి సర్వే నంబర్‌కూ ఆధార్ తరహాలో 'భూధార్'

**హైదరాబాద్, ఏప్రిల్ 2:** ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు. ఆమనగల్‌తో పాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా దీనిని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. 45 రోజుల పాటు ఈ విధానాన్ని పరిశీలించి, అవసరమైన మార్పులతో ప్రతి జిల్లాలో ఒక మండలంలో ఈ సేవలు ప్రారంభిస్తామన్నారు. పేదలు ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేకుండా తమ చేతిలోని స్మార్ట్ ఫోన్ ద్వారానే ఈ సేవలు పొందవచ్చని వివరించారు. ప్రతి భూమికి ఆధార్ తరహాలో 'భూధార్' నంబర్ కేటాయిస్తామని ప్రకటించారు.

మిగతా 3 లో

## ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్

- స్కిల్స్ యూనివర్సిటీ, ఎఫ్‌సీడీఏ పనుల పరిశీలన
- వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

2





# మేం పాలకులం కాదు.. సేవకులం

- 99 రోజుల ప్రగతి ప్రణాళిక ఒక దీక్ష
- ప్రతి గడపకు పథకాలు చేరడమే లక్ష్యం
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

3

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు తన సందేశాన్ని అందించారు. అధికారులు గ్రామ సభల్లో ఈ లేఖను చదివి వినిపించారు. తమ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాల మూడు నెలలు పూర్తయిందని సీఎం గుర్తు చేశారు. గత పాలకుల తప్పులను సరిదిద్దుతూ, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమం కోసం పని చేస్తున్నామని తెలిపారు. తాము పాలకులం కాదని, ప్రజల ఆకాంక్షలే పరమావధిగా పనిచేసే సేవకులం అని ఆయన స్పష్టం చేశారు. వరుస ఎన్నికల విజయాలు తమ బాధ్యతను మరింత పెంచాయని పేర్కొన్నారు.

## చికెన్ బంద్ సక్సెస్..

- దిగివచ్చిన పౌల్ట్రీలు
- వరంగల్ జిల్లాలో సమ్మె విరమించిన వ్యాపారులు
- 185 నుంచి రూ.125కు తగ్గిన బర్డ్ ధర
- హైదరాబాద్‌లో కొనసాగుతున్న మార్జిన్ వివాదం
- కిలోకు రూ.40 ఇవ్వాలన్నమన్న కోఆర్డినేషన్ కమిటీ

3



# నెలాఖరుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

**పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి**

**కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం**



**రంగారెడ్డి, ఏప్రిల్ 2:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతకు సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక ప్రకటన చేశారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మిఠాయిపల్లి పర్యటనలో ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి మూడు వేల ఐదు వందల ఇళ్ల చొప్పున కేటాయించామని, వాటి నిర్మాణాలు వేగంగా పూర్తి కావస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందే వరకు ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు.

**దళారుల ప్రమేయం లేకుండా ఎంపిక**

ఎక్కడా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే మేలు చేకూర్చడమే ప్రజా ప్రభుత్వం ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఏప్రిల్ నెలాఖరులోగా రెండో విడతకు సంబంధించిన మార్గదర్శకాలు, ఎంపిక జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తమ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించామని, దీనివల్ల భూ రికార్డుల్లో పారదర్శకత పెరుగుతుందని ఆయన వివరించారు. భూమికి సంబంధించిన అన్ని హక్కులను భద్రపరిచేలా ఈ పోర్టల్ పనిచేస్తుందని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

# హనుమంతుని శక్తి.. యువతకు ఆదర్శం

**జ్ఞానం, వాక్చాతుర్యం, భక్తికి నిలువుటద్దం ఆంజనేయుడు**

**రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**



**హైదరాబాద్, ఏప్రిల్ 2:** రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ సీతారామచంద్రమూర్తి పరమ భక్తుడైన హనుమంతుడు బలం, జ్ఞానం, వాక్చాతుర్యం కలగలిసిన అరుదైన వ్యక్తిత్వమని ఆయన కొనియాడారు. హిందూ పురాణాలు ఆంజనేయుడిని గొప్ప జ్ఞానిగా కీర్తిస్తాయని పేర్కొన్నారు. సంత్ తులసీదాస్ తన రామచరిత మానస్‌లో చెప్పినట్లు అంజనీ పుత్రుడు 'జ్ఞానినాం అగ్రగణ్యం' అని కేసీఆర్ గుర్తు చేశారు. అంటే జ్ఞానులందరిలోనూ అత్యున్నతుడు అని అర్థమన్నారు. వాల్మీకి రామాయణంలో శ్రీరాముడు హనుమంతుడిని ఉద్దేశించి 'న వాక్యదోషం నచ అపశబ్దం' అని పేర్కొన్నారని తెలిపారు. ఎటువంటి దోషాలు లేని భాషతో, వ్యాకరణంపై పట్టుతో, వాక్ శుద్ధితో ప్రసంగించే అద్భుతమైన వక్త హనుమంతుడని ఆయన ప్రశంసించారు. ధర్మరక్షణ కోసం తాను నమ్మిన శ్రీరాముడికి తన శక్తినంతా ధారపోసిన బలశాలి ఆంజనేయ స్వామి అని కేసీఆర్ కొనియాడారు. ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రజా సంక్షేమం కోసం నాయకత్వాన్ని తన భుజాలపై మోసిన ఆయన.. వినయానికి, విజయానికి మార్గదర్శి అని తెలిపారు. జ్ఞానం, భక్తి, మృదుస్వభావం కలగలిసిన సంపూర్ణ వ్యక్తిత్వం ఒక్క హనుమంతుడికే సాధ్యమన్నారు. హనుమంతుడి ఆచరణ ఎల్లకాలం ఆదర్శనీయమని, నేటి యువతరం ఆయన నుంచి ఎంతో నేర్చుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఆదర్శవంతమైన ఆలోచనలతో, దూరదృష్టితో తమ జీవితాలను తీర్చిదిద్దుకునే శక్తిని స్వామి రాష్ట్ర ప్రజలకు అందించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో ప్రగతి తిరిగి పుంజుకోవాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన ప్రార్థించారు.

# దోమతెర కప్పుకుని ఎమ్మెల్యే వినూత్న నిరసన

**అసెంబ్లీ వద్ద ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హల్‌చల్**



**హైదరాబాద్, ఏప్రిల్ 2:** హైదరాబాద్ నగరంలో పెరిగిపోయిన దోమల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వినూత్నంగా నిరసన తెలిపారు. ఒంటిపై దోమతెర కప్పుకుని, చేతిలో ఫాగింగ్ యంత్రంతో నేరుగా అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే తీరును గమనించిన మార్షల్స్ ఆయనను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆయన ధరించిన దోమతెరను తొలగించేందుకు ప్రయత్నించడంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొంది. అసెంబ్లీ సమావేశాలు లేని సమయంలో తనను అడ్డుకోవడంపై సుధీర్ రెడ్డి మార్షల్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త నిబంధనలు ఎప్పుడు వచ్చాయని ప్రశ్నించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నగరంలో దోమల తీవ్రత భరించలేక ప్రజలు హైదరాబాద్ వదిలి పారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోమల వల్ల నగరం బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని విమర్శించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నివారణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫాగింగ్ పనులను ముమ్మరం చేయాలని, మురికినీటి కాలువల శుభ్రతపై దృష్టి పెట్టాలని కోరారు. ఎమ్మెల్యే చేసిన ఈ వినూత్న నిరసన అసెంబ్లీ పరిసరాల్లో అందరి దృష్టిని ఆకర్షించింది.

# చేనేత కార్మికుల పొట్ట కొడుతున్న ప్రభుత్వం

- యూనిఫాం ఆర్డర్ల రద్దుపై కవిత తీవ్ర ఆగ్రహం
- అయిన వారి కోసమే నేతన్నలకు అన్యాయం
- టెస్కోను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోంది

**హైదరాబాద్, ఏప్రిల్ 2:**

కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేతలకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు కావాల్సిన వారికి మేలు చేసేందుకే వేలాది మంది కార్మికులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఏటా సుమారు 105 కోట్ల రూపాయల విలువైన యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాన్ని రద్దు చేయడంతో నేతన్నల ఉపాధి సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**రోడ్డున పడనున్న వేలాది కుటుంబాలు**

ప్రభుత్వ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం పడుతుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత పేర్కొన్నారు. సంక్షేమ శాఖలకు సంబంధించిన దుప్పట్లు, దుస్తుల విషయంలోనూ 200 కోట్ల రూపాయల ఆర్డర్లను స్థానిక చేనేతలకు ఇవ్వలేదని ఆరోపించారు. టెస్కో (యాజా) సంస్థను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు రేవంత్ సర్కార్ కుట్ర చేస్తోందని మండిపడ్డారు.

**ఉద్యమిస్తామని హెచ్చరిక**

రాష్ట్రంలోని చేనేత రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చేనేత కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నేతన్నల ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు.



# 'ఫ్యూచర్ సిటీ'కి సీఎం రేవంత్

- స్కిల్స్ యూనివర్సిటీ, ఎఫ్ సీ డీ ఏ కార్యాలయ పనుల పరిశీలన
- వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 2:**

కేరళలో ఎన్నికల ప్రచారాన్ని ముగించుకుని తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. వెంటనే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై దృష్టి సారించారు. గురువారం అధికారుల బృందంతో కలిసి ఆయన ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని సందర్శించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షించారు.

**స్కిల్స్ యూనివర్సిటీ పనుల తనిఖీ**

ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న ఎఫ్ సీ డీ ఏ కార్యాలయం, స్కిల్స్ యూనివర్సిటీ పనులను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణ పనులు జరుగుతున్న తీరుపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. కే. రామకృష్ణారావు సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. పనుల పురోగతిని సీఎంకు వివరించిన అధికారులు.. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నిర్మాణాలను పూర్తి చేస్తామని తెలిపారు. కేరళ పర్యటన ముగిసిన వెంటనే సీఎం ఈ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# కాంగ్రెస్ మోసాలను సోషల్ మీడియాలో ఎండగట్టాలి

- బీఆర్ఎస్ శ్రేణులకు హరీశ్ రావు పిలుపు
- పటాన్‌చెరులో పార్టీలోకి భారీగా చేరికలు



**సంగారెడ్డి, ఏప్రిల్ 2:**

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, మోసాలను సోషల్ మీడియా వేదికగా ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొల్లారంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండీ ఆరిఫ్ తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్ లో చేరారు. సీనియర్ నాయకులు బాలరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హరీశ్ రావు వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**సోషల్ మీడియానే కీలక ఆయుధం**

ప్రస్తుత రాజకీయాల్లో సోషల్ మీడియా ప్రాముఖ్యతను హరీశ్ రావు ఈ సందర్భంగా వివరించారు. రాజకీయంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంటూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉన్న సమస్యలను వెలుగులోకి తేవడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసిందని ఆయన మండిపడ్డారు. ఎన్నికలకు ముందు అమలుకాని హామీలతో గద్దెనెక్కి, అధికారంలోకి వచ్చాక నిలువునా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

రెండేళ్లలో రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అని తేలిపోయిందని, జాబ్ క్యాలెండర్ ఊసే లేదని హరీశ్ రావు విమర్శించారు. వృద్ధులకు పెన్షన్లు పెంచలేదని, మహిళలకు నెలకు 2,500 రూపాయల ఆర్థిక సాయం అందడం లేదని ధ్వజమెత్తారు. రైతులను సైతం మాట తప్పి వంచించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే యువత ముందుకొచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ చేస్తున్న ప్రతి మోసాన్ని సామాన్య ప్రజలందరికీ తెలిసేలా చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు పార్టీ ఇన్‌ఛార్జి ఆదర్శ్ రెడ్డి సహా స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే గ్రామసభల లక్ష్యం

- 2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతాం
- తుమ్మలూరు గ్రామసభలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించడమే ప్రభుత్వ ధ్యేయం




**రంగారెడ్డి, ఏప్రిల్ 2:**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మహేశ్వరం మండలం తుమ్మలూరులో నిర్వహించిన గ్రామసభలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కే. రామకృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

**ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

2047 విజన్‌తో తెలంగాణను దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి ఆకాంక్ష అని సీఎస్ తెలిపారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రగతి ప్రస్థానంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని వివరించారు.

**సంక్షేమ పథకాల అమలు**

ప్రభుత్వ పథకాలతో పాటు కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు సీఎస్ వెల్లడించారు. అన్ని హాస్టళ్లు, పాఠశాలల్లో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**మహిళా సాధికారతకు పెద్దపీట**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రామకృష్ణారావు తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన అందజేశారు. గ్రామసభ ద్వారా అందిన దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



# మేం పాలకులం కాదు.. సేవకులం

**99 రోజుల ప్రగతి ప్రణాళిక ఒక దీక్ష.. సీఎం రేవంత్ రెడ్డి**

**ప్రతి గడపకు పథకాలు చేరడమే లక్ష్యమని వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు తన సందేశాన్ని అందించారు. అధికారులు గ్రామ సభల్లో ఈ లేఖను చదివి వినిపించారు. తమ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాల మూడు నెలలు పూర్తయిందని సీఎం గుర్తు చేశారు. గత పాలకుల తప్పులను సరిదిద్దుతూ, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమం కోసం పని చేస్తున్నామని తెలిపారు. తాము పాలకులం కాదని, ప్రజల ఆకాంక్షలే పరమావధిగా పనిచేసే సేవకులం అని ఆయన స్పష్టం చేశారు. వరుస ఎన్నికల విజయాలు తమ బాధ్యతను మరింత పెంచాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాల మీద కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తేవాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మార్చి 6 నుండి 99 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా కొనసాగాలని కోరారు. ఊరు వాడ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు శ్రమించాలని ఆదేశించారు. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, కార్యాలయాల్లో పరిశుభ్రత, పారదర్శకత ఉండాలని సూచించారు. మహాలక్ష్మి ఉచిత బస్సు సౌకర్యం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలపాలన్నది తమ సంకల్పమని ప్రకటించారు. క్యూర్, ప్యూర్, రేర్ గా రాష్ట్రాన్ని వర్గీకరించి సేవ, తయారీ, వ్యవసాయ రంగాల్లో ఆదర్శంగా ఎదగాలని కోరారు. నాలుగు కోట్ల ప్రజలు ఒక్కటై ఈ కలను సాకారం చేయాలని, తన దీక్షలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ మహా యజ్ఞంలో ప్రజలందరి సహకారం కావాలని ఆయన తన సందేశంలో వివరించారు.

# ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు

**జూన్ 12న తిరిగి ప్రారంభం కానున్న పాఠశాలలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 2:** ఎండలు మండుతున్న వేళ తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు తీపి కబురు అందించింది. ఈ ఏడాది వేసవి సెలవుల షెడ్యూల్‌ను విద్యాశాఖ అధికారికంగా ప్రకటించింది. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు మొత్తం 48 రోజుల పాటు బడులకు సెలవులు ఉండనున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈ సెలవులు వర్తిస్తాయి. సుదీర్ఘ విరామం తర్వాత జూన్ 12న పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. సెలవులు ప్రారంభమయ్యే లోపు నిర్దేశించిన సిలబస్ పూర్తి చేయాలని ప్రభుత్వం పాఠశాల యాజమాన్యాలను ఆదేశించింది. చదువుకు ఆటంకం కలగకుండా అవసరమైతే వారానికి ఒకసారి అదనపు తరగతులు నిర్వహించుకోవచ్చని సూచించింది. పరీక్షలు కూడా ఈ లోపే పూర్తి చేయాలని విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# క్యాటరింగ్ ముసుగులో కంత్రీ పనులు

- అదనపు బిల్లుల కోసం మహిళల ఫొటోలతో బ్లాక్ మెయిల్
- మోండా మార్కెట్ కు చెందిన కేటుగాడి అరెస్ట్

**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** చేసేది క్యాటరింగ్ వ్యాపారమే అయినా చాటుమాటుగా కంత్రీ పనులకు పాల్పడుతున్న ఓ కేటుగాడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్ పరిధిలోని మోండా మార్కెట్‌కు చెందిన వన్నూరు స్వామి అలియాస్ అంజి కిరణ్ స్థానికంగా క్యాటరింగ్ నిర్వహిస్తున్నాడు. విందులు, ఫంక్షన్లకు భోజనం సరఫరా చేయడంతో పాటు వడ్డించేందుకు కుర్రాళ్లను పంపుతుంటాడు. అయితే ఈ క్యాటరింగ్ చాటున అతడు దగుల్బాజీ పనులకు పాల్పడుతున్నాడు. ముందే మాట్లాడుకున్న దాని కంటే అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తూ ఫంక్షన్లలో దొంగచాటుగా మహిళల ఫొటోలు తీసి బ్లాక్ మెయిలింగ్ కు దిగుతున్నాడు.

**అదనపు డబ్బుల కోసం వేధింపులు**

మోండా మార్కెట్‌లో నివసిస్తున్న ఓ వ్యక్తి తన ఇంట్లో జరుగుతున్న శుభకార్యం కోసం అంజి కిరణ్ కు క్యాటరింగ్ ఆర్డర్ ఇచ్చాడు. ప్లేట్ భోజనం ధర, సిబ్బంది ఖర్చులు అన్నీ ముందే మాట్లాడుకున్నారు. తీరా ఫంక్షన్ ముగిశాక అంజి కిరణ్ ఏవేవో ఛార్జీల పేరుతో అదనంగా డబ్బులు డిమాండ్ చేశాడు. ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే గొడవకు దిగి అసభ్యంగా దూషించాడు. ఫంక్షన్‌కు వచ్చిన మహిళల ఫొటోలు దొంగచాటుగా తీశానని, అడిగిన డబ్బులు ఇవ్వకపోతే వాటిని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు.

**గతంలోనూ రెండు కేసులు**

నిందితుడి తీరుతో విసిగిపోయిన బాధిత కుటుంబం వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు అంజి కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. ఇలాంటి బ్లాక్ మెయిలింగ్ బెదిరింపులకు పాల్పడినందుకు గతంలో కూడా ఇతనిపై రెండు కేసులు నమోదైనట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

# టెర్రరిస్టుల్లా ప్రతిపక్షాల తీరు

## ఎన్నికల్లో ఓడినా వాళ్లకు జ్ఞానోదయం కాలేదు

- విపక్షాలపై మంత్రి పొంగులేటి ధ్వజం
- 45 రోజుల తర్వాత జిల్లాకో మండలంలో ‘భూభారతి‘
- ప్రతి సర్వే నంబర్‌కూ ఆధార్ తరహాలో ‘భూధార్‘



**ఆమనగల్, ఏప్రిల్ 2:** అసెంబ్లీలో ప్రతిపక్ష నేతలు టెర్రరిస్టుల్లా ప్రవర్తించారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వరుస ఎన్నికల్లో ఓడిపోయినా వారికి ఇంకా జ్ఞానోదయం కాలేదని విమర్శించారు. గత ప్రభుత్వం అరాచకాలకు పాల్పడితే, ఇందిరమ్మ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోందని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని మిఠాయిపల్లిలో గురువారం జరిగిన గ్రామసభలో ‘ఇంటిగ్రేటెడ్ భూభారతి‘ పోర్టల్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

**చేతిలోని ఫోన్‌తోనే సేవలు**

ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు. ఆమనగల్ తో పాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా దీనిని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. 45 రోజుల పాటు ఈ విధానాన్ని పరిశీలించి, అవసరమైన మార్పులతో ప్రతి జిల్లాలో ఒక మండలంలో ఈ సేవలు ప్రారంభిస్తామన్నారు. పేదలు ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేకుండా తమ చేతిలోని స్మార్ట్ ఫోన్ ద్వారానే ఈ సేవలు పొందవచ్చని వివరించారు. ప్రతి భూమికి ఆధార్ తరహాలో ‘భూధార్‘ నంబర్ కేటాయిస్తామని ప్రకటించారు.

**సాదాబైనామాలకు త్వరలో మోక్షం**

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వల్ల 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్ లో పడ్డాయని పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. సాగుచేస్తూ అధీనంలో ఉన్న భూములకు సంబంధించి సదరు వ్యక్తుల సమ్మతి తీసుకుని వారికే పట్టాలు ఇచ్చేలా భూభారతిలో సవరణలు చేశామన్నారు. మున్సిపాలిటీలుగా మారిన గ్రామాలకు కూడా సాదాబైనామాలు వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. సర్వే విషయంలో పాత పద్ధతులకు స్వస్తి పలికి 411 రోవర్లతో కచ్చితమైన సర్వే చేయిస్తున్నామని, త్వరలో మరో 400 రోవర్లు రాబోతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో త్వరలోనే తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలకు శంకుస్థాపన చేస్తానని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ బంద్ సక్సెస్..

- దిగివచ్చిన పౌల్ట్రీలు
- వరంగల్ జిల్లాలో సమ్మె విరమించిన వ్యాపారులు
- 185 నుంచి 125 రూపాయలకు తగ్గిన బర్డ్ ధర
- హైదరాబాద్‌లో కొనసాగుతున్న మార్జిన్ వివాదం
- కిలోకు 40 రూపాయలు ఇస్తున్నామన్న కోఆర్డినేషన్ కమిటీ



**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** చికెన్ షాపుల నిర్వాహకులు చేపట్టిన బంద్ దెబ్బకు పౌల్ట్రీ కంపెనీలు దిగివచ్చాయి. వరంగల్ జిల్లాలో పౌల్ట్రీ యాజమాన్యాలు బర్డ్ ధరను 185 రూపాయల నుంచి 125 రూపాయలకు తగ్గించాయి. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు గతంలో మాదిరిగానే కిలోకు 15 రూపాయలకు పైగా మార్జిన్ ఇచ్చేందుకు అంగీకరించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా బ్రాయిలర్ ట్రేడర్స్ అసోసియేషన్ బంద్‌ను విరమించుకుంది. ఒక్కరోజు బంద్‌తో నాటుకోళ్లు, మాంసం అమ్మకాలకు భారీగా డిమాండ్ పెరిగింది. బ్రాయిలర్ అందుబాటులో లేకపోవడంతో సాధారణ రోజుల కంటే మాంసం విక్రయాలు 20 నుంచి 25 శాతం వరకు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు.

**హైదరాబాద్‌లో కోఆర్డినేషన్ కమిటీ వివరణ**

చికెన్ రేటు మార్జిన్ విషయంలో రిటైల్ వ్యాపారులు పొంతన లేకుండా వ్యవహరిస్తున్నారని బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కో ఆర్డినేషన్ కమిటీ నాయకులు రామిరెడ్డి, బాలసుబ్రహ్మణ్యన్, రాజిరెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ సోమాజిగూడలో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. తాము కొన్నేళ్లుగా కిలోకు 40 రూపాయల మార్జిన్ ఇస్తుంటే కొందరు కావాలనే వ్యాపారులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కంపెనీలు నష్టాల్లో ఉన్నా కస్టమర్లపై భారం పడకుండా రేటు నిర్ణయిస్తున్నామని స్పష్టం చేశారు. రిటైల్ వ్యాపారులతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

**కొనసాగుతున్న రిటైల్ షాపుల ఆందోళన**

మరోవైపు తెలంగాణ రాష్ట్ర రిటైల్ చికెన్ షాప్స్ అసోసియేషన్ బంద్ రెండో రోజుకు చేరుకుంది. మార్జిన్‌ను 26 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడాన్ని నిరసిస్తూ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద అసోసియేషన్ ప్రతినిధులు రాజు, శ్రీనివాస్, గోపి, యాదగిరి, వేముల శ్రీనివాస్ తదితరులు ఆందోళన చేపట్టారు. బుధవారం జరిగిన ఈ ధర్నాలో వరంగల్ జిల్లాకు చెందిన వ్యాపారులు సైతం పాల్గొన్నారు. చిల్లర చికెన్ వ్యాపారులను దెబ్బతీసేలా పౌల్ట్రీ కంపెనీలు కుట్ర చేస్తున్నాయని వారు ఆరోపించారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని విధానపరంగా చికెన్ ధరలు, కమీషన్ మార్జిన్ నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు.

# మల్టీప్లెక్స్ బాటలో సింగిల్ స్క్రీన్లు

- నేటి నుంచే పర్సంటేజీ విధానం అమలు
- హైదరాబాద్‌లోని 23 థియేటర్ల కీలక నిర్ణయం
- మనుగడ కోసమేనన్న ఎగ్జిబిటర్లు




**హైదరాబాద్, ఏప్రిల్ 1:** తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉ ద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ది చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే పక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టార్గెట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | శుక్రవారం 3 ఏప్రిల్ 2026



సంపాదకీయం

# జగన్.. చపలచిత్త రాజకీయాలు!

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజకీయాలు సూస్తుంటే ..ఇంతటి అపరిపక్వ రాజకీయ నేతను చూసి ఉండమేమో అనిపిస్తుంది. చంద్రబాబు మీద వ్యతిరేకత ఉన్నవారు సైతం రాజధాని విషయంలో వ్యతిరేకించడం లేదు. ఏ విషయంలోనూ స్పష్టత లేని జగన్ ఐదేళ్ల పాటు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అతి తక్కువ సమయంలో సిఎంగా ప్రజలు ఆదరిస్తే, దానిని అద్భుత అవకాశంగా తీసుకుని, దార్శనికతను ప్రదర్శించాల్సిన జగన్, తన ఫ్యాక్షన్ రాజకీయతనుజోడించి అభాసుపాలయ్యారు. అధికారంలో ఉండగా మూడు రాజధానులు అంటూ, రాజధాని రైతులను రాచిరంపాన పెట్టారు. అమరావతి ని వేశ్యల రాజధాని అన్నారు. అదో కమ్మ సామ్రాజ్యం అన్నారు. మూడు రాజధానులంటూ ఊదరగొట్టి, అసలు రాజధాని లేకుండా ఐదేళ్లు కాలం గడిపారు. ఇప్పుడేమో మావిగన్ అంటూ జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. ఇవన్నీ చూస్తుంటే జగన్‌లో ఓ అపరిచితుడు ఉన్నాడా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. రాజధాని అమరావతి రైతులకు న్యాయం జరగడం లేదంటున్న వ్యక్తి, తన సొంతింట్లో సొంత చెల్లెలికి మాత్రం న్యాయం చ ఏయడం లేదు. హక్కుగా ఉన్న ఆస్తిని పంచడం లేదు. తల్లి చెప్పినా వినడం లేదు. అంతెందుకు రాజధాని విషయంలో ఏం మాట్లాడుతున్నారో ఆయనకైనా అర్థం అవుతందా అన్నది అర్థం కావడం లేదు. మూడు రాజధానులు అన్నారు. అసలు రాజధాని అవసరం లేదంటున్నాడు. మావిగన్ అంటున్నాడు. అంటే చిత్తశుద్ధి, స్థిర సంకల్పం లేని రాజకీయ నేతగా జగన్‌ను చూడాలి. ఇలాంటి వారు అధికారంలో ఉండగా ఎంతగా తెగించారో చూశాం. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్.. ఇప్పుడు 'ప్లాన్-బి' పేరుతో కొత్త పల్లవి అందుకున్నారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ నచ్చకపోతే.. ప్లాన్-బీ కింద మచిలీపట్నం (మా) -విజయవాడ (వి)-గుంటూరు (గన్) నగరాలను రాజధానిగా అభివృద్ధి చేయొచ్చని సెలవిచ్చారు. దీనికి ఎంచక్కా 'మావిగన్' అని పేరు పెట్టొచ్చన్నారు. 'గన్'లో తన పేరు ఉన్నందున, అది నచ్చకపోతే ఇంకోపేరు పెట్టుకోవచ్చని కూడా సలహా ఇచ్చారు. మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు మధ్య 110 కిలోమీటర్ల హైవే ప్రాంతం పరిధిలో 110 ఎకరాల్లో రాజధాని నగరాన్ని ఏర్పాటు చేయొచ్చని జగన్ పేర్కొన్నారు. 'మావిగన్'పై తన అభిప్రాయాన్ని విన్నాక .. రాష్ట్ర ప్రజలు తనతో ఏకీభవిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి మాత్రం ఆచరణ సాధ్యం కాదని తేల్చేశారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీలో చట్ట సవరణ ద్వారా రాజధానిని మార్చేస్తామని కూడా ప్రకటించారు. గతంలో తుగ్లక్ కూడా ఇలాగే చేశారు. ఇష్టం వచ్చినట్లుగా రాజధానిని మార్చేశారు. ఇప్పుడు జగన్ చేస్తున్న లేదా చెబుతున్నది అలాగే ఉంది. అంతెందుకు అసలు రాష్ట్రాలకు రాజదాని అసవరం లేదని సెలవిచ్చారు. గతంలో ఆయనగారు తాను అంటే సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అన్నారు. దీనిపై మాజీమంత్రి సోమిరెడ్డి సెటైర్లు వేశారు. లాట్రిన్‌లో ఉంటే అదే రాజధాని అవుతుందనుకోవాలా అని ఆన్నారు. రాజ్యాంగంలో దేశ రాజధానిపై నిర్వచనం ఉందే తప్ప.. రాష్ట్రాల రాజధాని ప్రస్తావనే ఎక్కడా లేదని జగన్ చెప్పడం ఆయన అవివేకానికి పరాకాష్టగా చెప్పుకోవాలి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేసినా నిలువదంటున్నారు. భవిష్యత్‌లో ప్రజాభీష్టం మేరకు ఏర్పడే రాష్ట్రప్రభుత్వం.. రాజధానిని అమరావతి నుంచి మారు-స్తూ చట్టసవరణ చేయవచ్చని కూడా సెలవిచ్చారు. అమరావతికి తాను ఏనాడూ వ్యతిరేకం కాదని, అందుకే శాసన రాజధానిగా ఏర్పాటు చేశానని తెలిపారు. అమరావతికి ఏ ఒక్కరూ వ్యతిరేకం కాదని, రాజధాని పేరిట చేస్తున్న అవినీతికే వ్యతిరేకమని చెప్పారు. అమరావతిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కంటే తానే ఎక్కువ కాలం కాపురం చేశానని జగన్ చెప్పుకున్నారు. తనకు అమరావతిపై అభిమానం ఉందనేందుకు చంద్రబాబు కంటే ముందుగానే తాడేపల్లిలో సొంత ఇల్లు కట్టుకున్నానని.. ప్రస్తుతం అదే భూమిపై ఉండడమే సాక్ష్యమన్నారు. ఇలా అర్థంపర్థం లేని వ్యాఖ్యలు, వాదనలు జగన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అతనిలోని నిరంకుశ విధానాలు బటయకు వస్తున్నాయి. అధికారంలో ఉంటే ఎంతటి విధ్వంసానికి అయినా తెగిస్తారని ప్రజావేదిక కూల్చివేతతో చూపారు. మద్యపాన నిషేధం పేరుతో మద్యంపై దందా చేశారు. ఒక్కటేమిటి సకల వ్యవస్థలను భ్రష్టు పట్టించి, బటన్ నొక్కుడుతో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు. అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు. విశాఖ భీమిలిలో ప్యాలెస్‌లు కట్టుకుని తన రాజరిక పోకడలను చాటారు. అందుకే ఇప్పుడు జగన్ తననకున్న కాస్తా ఇమేజ్‌ను బజారున పడేసుకున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించడం ద్వారా వైసీపీతో పాటు జగన్ జాతీయ రాజకీయాల్లో భ్రష్ట చరిత్రను లిఖించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి సంబంధించిన బిల్లును.. వైసీపీ తప్ప అన్ని పార్టీలూ సంపూర్ణంగా సమర్థించాయి. బిల్లును వ్యతిరేకించొద్దు.. మద్దతు ఇవ్వొద్దన్నది తొలుత వైసీపీ తీసుకున్న నిర్ణయం. అయితే కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు సైతం అమరావతికి మద్దతిస్తూ మాట్లాడడంతో వైసీపీ నాయకత్వానికి దిక్కుతోచలేదు. చివరకు వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును విమర్శిస్తూ వైసీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని గానీ.. ఆ పార్టీ ఎంపీల వాకౌట్‌ను గానీ సభలో ఎవరూ పట్టించుకోలేదు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగుస్తున్న వేళ, అకస్మాత్తుగా బిల్లును తెరపైకి తేవడం.. దానికి ముందే అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపాలని స్వయంగా ప్రధాని కార్యాలయం రాష్ట్రప్రభుత్వానికి సూచించడం.. ఆగమేఘాలపై కూటమి ప్రభుత్వం అత్యవసరంగా అసెంబ్లీని సమావేశపరచి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం.. శాసనమండలిలో పెట్టనవసరం లేదని తేల్చడం.. ఆ వెంటనే కేంద్రం బిల్లును తీసుకురావడం.. శరవేగంతో జరిగిన ఈ పరిణామాలతో జగన్ ఉక్కిరిబిక్కరి అయ్యారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఓవైపు మతపరమైన, కుటుంబపరమైన వివాదాలు జగన్‌ని చుట్టుముడుతున్న వేళ, ఇప్పుడు అమరావతితో రాజకీయంగా సమాధి తవ్వుకున్నట్లుగానే భావించాలి. వర్తమాన రాజకీయాలలో జగన్ తనవికృత రాజకీయ మేథను ప్రదర్శించి మరొకరు సాటిరారని ప్రచారం చేసుకున్నారు. ఇలాంటి రాజకీయ నేతల వల్ల ప్రజలకు కానీ, రాష్ట్రానికి కానీ మేలు జరగదు. ఫక్తు ఫూడల్ వ్యవస్థకు పునాదిగా జగన్ రాజకీయ ఆలోచనలు అద్దం పడుతున్నాయి.

# దేశంలో డిజిటల్ జనగణన ప్రారంభం

- స్వయంగా వివరాలు నమోదు చేసుకున్న రాష్ట్రపతి, ప్రధాని!
- తొలిసారిగా ఆన్‌లైన్ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా గణన
- మొదటి రోజే 55 వేల కుటుంబాల స్వీయ నమోదు..
- ఈసారి కులగణన కూడా!

**న్యూఢిల్లీ, ఏప్రిల్2:** భారతదేశ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. దేశవ్యాప్తంగా మొదటిసారిగా పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న జనగణన ప్రక్రియ బుధవారం లాంఛనంగా ప్రారంభమైంది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ కార్యక్రమం మొదలైంది. ఈ చారిత్రాత్మక స్వీయ నమోదు ప్రక్రియలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రాష్ట్రపతి భవన్‌లో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన కుటుంబ వివరాలను నమోదు చేయగా, ప్రధాని నరేంద్ర మోదీ కూడా డిజిటల్ పద్ధతిలో వివరాలు సమర్పించారు. దేశాభివృద్ధిలో కీలకమైన ఈ ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. వీరితో పాటు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. అధికారుల గణాంకాల ప్రకారం, జనగణన ప్రారంభమైన తొలిరోజే సుమారు 55 వేల కుటుంబాలు స్వీయ నమోదు సదుపాయాన్ని వినియోగించుకోవడం విశేషం.

### రెండు దశల్లో ప్రక్రియ - 16 భాషల్లో యాప్


ఈసారి జనగణనను ప్రభుత్వం రెండు దశల్లో నిర్వహిస్తోంది. మొదటి దశలో గృహాల గణన, రెండో దశలో జనాభా లెక్కింపు చేపడతారు. ఈసారి ప్రత్యేకంగా కులగణన కూడా ఉండటంతో దీనికి ప్రాధాన్యత పెరిగింది. ప్రజలు తమకు వీలైన సమయంలో ఆన్‌లైన్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా 16 భాషల్లో వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఏప్రిల్ 1 నుండి సెప్టెంబర్ 30 వరకు మొదటి దశ ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతి రాష్ట్రంలో క్షేత్రస్థాయి సర్వేకు 15 రోజుల ముందే స్వీయ నమోదు ప్రక్రియ అందుబాటులో ఉంటుందని అధికారులు వెల్లడించారు.





# హర్మూజ్ జలసంధి పునరుద్ధరణకు 40 దేశాల కసరత్తు

- భారత్‌కు ఆహ్వానం!
- బ్రిటన్ నేతృత్వంలో కీలక సమావేశం..
- వర్చువల్‌గా పాల్గొననున్న విదేశాంగ కార్యదర్శి
- చమురు రవాణాకు ఆటంకం కలగకుండా అంతర్జాతీయ ప్రయత్నాలు



**న్యూఢిల్లీ:** ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు అంతర్జాతీయ స్థాయిలో ముమ్మర ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో, బ్రిటన్ నేతృత్వంలో ఒక కీలక సమావేశం ఏర్పాటు కానుంది. ఈ చర్చల్లో పాల్గొనాల్సిందిగా భారత్ సహా 40కి పైగా దేశాలను ఆహ్వానించారు.

### భారత్ భాగస్వామ్యం

బ్రిటన్ ఏర్పాటు చేయనున్న ఈ సమావేశానికి భారత్ తరఫున విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వర్చువల్‌గా హాజరుకానున్నట్లు కేంద్ర ప్రభుత్వం ధ్రువీకరించింది. అయితే, ఈ సమావేశంలో అమెరికా పాల్గొనకపోవడం గమనార్హం. అంతర్జాతీయ వాణిజ్యానికి, ముఖ్యంగా భారతదేశ ఇంధన అవసరాలకు హర్మూజ్ జలసంధి గుండా సాగే నౌకాయానం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం కావడంతో భారత్ ఈ చర్చలను కీలకంగా భావిస్తోంది.

### సురక్షిత రవాణాపై దృష్టి:

జలసంధిలో నౌకలు నిరాటంకంగా, సురక్షితంగా ప్రయాణించేలా చూడటంపై భారత్ ఇప్పటికే ఇరాన్ సహా పలు దేశాలతో దౌత్యపరమైన సంప్రదింపులు జరుపుతోంది. ఈ చర్చలు సత్ఫలితాలను ఇస్తున్నాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ వెల్లడించారు. అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో స్థిరత్వం రావాలంటే హర్మూజ్ జలసంధి గుండా రవాణా పునరుద్ధరణ అనివార్యమని భారత్ తన గళాన్ని వినిపిస్తోంది. ఈ 40 దేశాల ఉమ్మడి ప్రయత్నం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై యుద్ధం చూపిస్తున్న ప్రభావాన్ని తగ్గించే దిశగా ఒక కీలక అడుగుగా భావించవచ్చు.

# అమెరికా తలవంచే వరకు యుద్ధం ఆగదు

### ఇరాన్ సైన్యం తీవ్ర హెచ్చరిక!

### మా సామర్థ్యం దెబ్బతినలేదు.. ట్రంప్ వ్యాఖ్యలు అవాస్తవం

### భారత మిత్రులు సురక్షితమే: ఇరాన్ భరోసా

**ఢిల్లీ:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో ఇరాన్ సైన్యం అమెరికాపై నిప్పులు చెరిగింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన బలహీనపడ్డాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ మిలిటరీ కమాండ్ తీవ్రంగా ఖండించింది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపంతో లొంగిపోయే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ అధికారిక మీడియా ఒక ప్రకటనను విడుదల చేసింది.

### ట్రంప్ వాదనలు అవాస్తవం:

తమ సైనిక మౌలిక సదుపాయాలు, క్షిపణి వ్యవస్థలు, డ్రోన్ కేంద్రాలను ధ్వంసం చేశామన్న ట్రంప్ ప్రకటనలో నిజం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా నిఘా వర్గాలకు తమ వ్యూహాత్మక సామర్థ్యాల గురించి పూర్తి సమాచారం లేదని ఎద్దేవా చేసింది. ఇరాన్‌ను 'రాతి యుగం'లోకి పంపిస్తామన్న ట్రంప్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చ తెచ్చే నేరాలను ఆధునిక ప్రపంచంలోకి తెస్తున్న అమెరికాయే అసలైన రాతియుగపు ఆలోచనలు చేస్తోందని దుయ్యబట్టింది. అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు తమ వద్ద పటిష్టంగా ఉన్నాయని పునరుద్ఘాటించింది.

### భారతీయులకు భరోసా:

యుద్ధ ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కీలక ప్రకటన చేసింది. పశ్చిమాసియాలో ఉన్న 'భారత మిత్రులు' అందరూ సురక్షితంగా ఉన్నారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని 'ఎక్స్' వేదికగా భరోసా ఇచ్చింది. అంతకుముందు హర్మూజ్ జలసంధి భవిష్యత్తును ఇరాన్, ఒమన్ దేశాలు మాత్రమే నిర్ణయిస్తాయని దక్షిణాఫ్రికాలోని ఇరాన్ రాయబార కార్యాలయం చేసిన పోస్టును రీట్వీట్ చేస్తూ, భారతీయుల భద్రతపై స్పష్టతనిచ్చింది. ఈ పరిణామాలు అంతర్జాతీయ స్థాయిలో యుద్ధ తీవ్రత ఏ స్థాయికి చేరుతుందోనన్న ఆందోళనను పెంచుతున్నాయి.


# ట్రంప్ వ్యాఖ్యలపై మేక్రాన్ సీరియస్

- 'అవి ఆయన స్థాయికి తగవు' అంటూ చురకలు!
- ఫ్రాన్స్ అధ్యక్షుడిపై అమెరికా అధ్యక్షుడి వ్యక్తిగత విమర్శలు
- వ్యక్తిగత దూషణలు మాని పశ్చిమాసియాపై దృష్టి పెట్టాలని సూచన

**ఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌ల మధ్య మాటల యుద్ధం ముదిరింది. మేక్రాన్‌ను 'భార్యా బాధితుడు' అంటూ ట్రంప్ చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలపై మేక్రాన్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలపై స్పందించాల్సిన అవసరం తనకు లేదని, అవి ఒక దేశ అధ్యక్షుడి స్థాయికి ఏమాత్రం తగవని ఆయన హితవు పలికారు. అమెరికా అధ్యక్ష భవనంలో ఇటీవల జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. మేక్రాన్ సతీమణి బ్రిగిట్టే ఆయనను చాలా దారుణంగా చూస్తుందని ఎగతాళి చేశారు. గతంలో మేక్రాన్ దవడకు తగిలిన గాయం గురించి ప్రస్తావిస్తూ.. ఆ దెబ్బ నుంచి ఆయన ఇంకా కోలుకోలేదని పరిహసించారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ఒకటి బయటకు రావడంతో అంతర్జాతీయ స్థాయిలో పెద్ద చర్చకు దారితీసింది. గతంలో బ్రిగిట్టే తన భర్తను తోసివేసినట్లు ఉన్న ఒక వీడియో వైరల్ కావడాన్ని సాకుగా తీసుకుని ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

### హుందాతనం ముఖ్యం:

ప్రస్తుతం సియోల్ పర్యటనలో ఉన్న మేక్రాన్, ట్రంప్ తీరును ఎండగట్టారు. ఇలాంటి వ్యక్తిగత విషయాలపై సమయం వృథా చేయడం కంటే, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, కాల్పుల విరమణ వంటి కీలక అంతర్జాతీయ అంశాలపై అమెరికా దృష్టి పెడితే మంచిదని సూచించారు. ఫ్రాన్స్ చట్టసభ సభ్యులు కూడా ట్రంప్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మిత్రదేశాల అధినేతల వ్యక్తిగత జీవితాల గురించి మాట్లాడటం దౌత్యపరంగా ఆమోదయోగ్యం కాదని వారు స్పష్టం చేశారు. ఈ పరిణామం అమెరికా, ఫ్రాన్స్ మధ్య ఉన్న సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# త్యాగాలు మరిచారా..
# మల్లన్నసాగర్ భూనిర్వాసితుల ఆగ్రహం



- గజ్వేల్ వార్డు సభలో అధికారులను నిలదీసిన నిర్వాసితులు.. పరిహారంపై నిర్లక్ష్యం
- ఊరు, భూమి వదిలితే పట్టించుకోరా? డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ప్లాట్ల కోసం నిరీక్షణ
- 18 ఏళ్లు నిండిన యువతకు ప్యాకేజీ ఎక్కడ? - ప్రభుత్వ తీరుపై బాధితుల ఆవేదన
- సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం - వార్డు కౌన్సిలర్ రమేష్ నాయక్ హామీ

**నేటి సాక్షి, గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో నిర్వహించిన వార్డు సభ బుధవారం ఉద్రిక్తంగా మారింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్న సమయంలో మల్లన్నసాగర్ భూనిర్వాసితులు ఒక్కసారిగా తరలివచ్చి అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏండ్ల తరబడి తమకు రావాల్సిన నష్టపరిహారం అందించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం తాము భూములు, ఇళ్లు, కన్నూరిని వదిలేసి త్యాగాలు చేశామని, కానీ ప్రభుత్వం తమను విస్మరించిందని భూనిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అందాల్సిన ఆర్థిక ప్యాకేజీలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఓపెన్ ప్లాట్లు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు రావాల్సిన పరిహారం విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. తమ త్యాగాలకు గుర్తింపు లేకుండా పోయిందని, తక్షణమే పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ రమేష్ నాయక్ మాట్లాడుతూ, నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వార్డు ప్రజల నుంచి అందిన ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. గతంలో నిలిచిపోయిన ప్యాకేజీలు అందేలా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు మరియు పెద్ద సంఖ్యలో నిర్వాసితులు పాల్గొన్నారు.

# పురుగుమందుల దుకాణాలపై వ్యవసాయ శాఖ దాడులు



**నేటి సాక్షి, గజ్వేల్:** రైతుల ఆరోగ్య భద్రతతో పాటు ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రమాదకరమైన 'పారాక్వాట్' (గ్రుఖుతీఖునబ్ఖ్) గడ్డిమందు అమ్మకాలను 60 రోజుల పాటు నిలిపివేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. జీఓ నంబర్ 24 ప్రకారం ఈ నిషేధం అమలులోకి వచ్చిన నేపథ్యంలో, గజ్వేల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని మండలాల్లో అధికారులు పురుగుమందుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గజ్వేల్ మండలంలో ఏడీఏ బాబు నాయక్, ఏఓ నాగరాజు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి, పారాక్వాట్ నిల్వలను పరిశీలించడంతో పాటు డీలర్లకు అమ్మకపు నిలుపుదల నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పారాక్వాట్ గడ్డిమందు వాడకం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడమే కాకుండా, మనుషులకు క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని హెచ్చరించారు. పంట పొలాల్లో ఈ మందును పిచికారీ చేయడం వల్ల ఆహార ధాన్యాలు కలుషితమై ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. అలాగే పశువులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉన్నందున రైతులు ఈ గడ్డిమందును కొనుగోలు చేయవద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా డీలర్లు పారాక్వాట్ విక్రయాలు కొనసాగిస్తే, వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ నాగరాజు, ఏఈఓ నర్సింలు మరియు సంబంధిత డీలర్లు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణతో భక్తి సేవ



- సిరికొండలో ఆదర్శంగా నిలిచిన విరాళం
- హనుమాన్ జయంతి సందర్భంగా అన్నప్రసాదానికి 350 స్టీల్ ప్లేట్లు బహుకరణ
- 'ప్లాస్టిక్ వద్దు - ఆరోగ్యమే ముద్దు' సంకల్పంతో ముందుకొచ్చిన వైద్యుడు
- 'డాక్టర్ రాజేశ్ రేగొండ' సేవలకు గ్రామస్తుల ప్రశంసలు



**నేటి సాక్షి, కథలాపూర్ (రాధారపు నర్సయ్య ):** పర్యావరణ పరిరక్షణతో కూడిన భక్తి సేవ'కు శ్రీకారం చుట్టారు విజయ హాస్పిటల్ (కోరుట్ల) అధినేత డాక్టర్ రాజేశ్ రేగొండ. కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా. డాక్టర్ రాజేష్ 350 స్టీల్ ప్లేట్లను అన్నప్రసాద వితరణ కోసం బహుకరించడం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. సిరికొండ గ్రామంలోని హనుమాన్ వాడ మందిరంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణను విస్తృతంగా చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి తోడ్పాటుగా డాక్టర్ రాజేశ్ రేగొండ 350 స్టీల్ ప్లేట్లను అందజేయడం విశేషంగా నిలిచింది. భక్తుల సౌకర్యం, శుభ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ సహాయం అందించబడింది. 'ప్లాస్టిక్ వద్దు, ఆరోగ్యమే ముద్దు అనే నినాదంతో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఈ విరాళం అందించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ పాత్రల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్టీల్ ప్లేట్ల వినియోగం ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ చర్య పర్యావరణ పరిరక్షణలో ఒక మంచి ముందడుగుగా భావిస్తున్నారు. ఆలయ అభివృద్ధిలో ఎప్పటికప్పుడు సహకరిస్తూ వస్తున్న డాక్టర్ రాజేశ్ రేగొండ మరియు వారి కుటుంబ సభ్యులకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వారి సేవా భావానికి ఆంజనేయ స్వామి ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు. 'భక్తి, సేవా భావం, పర్యావరణ పరిరక్షణ..'ఈ మూడు అంశాలను కలిపిన ఈ కార్యక్రమం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాలు మరింత మందిని స్ఫూర్తి పరుస్తాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు

## కోయిల్ సాగర్ సాగునీరు విడుదల

### అన్నదాతల హర్షం



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలలోని పంట పొలాలకు కోయిల్ సాగర్ ప్రాజెక్టు ద్వారా గురువారం సాగునీటిని విడుదల చేశారు. నీటిపారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను చేపట్టారు. రైతులకు రెండో పంట కింద సాగునీరు అందించే ఉద్దేశంతోనే ప్రాజెక్టు నుండి నీటిని వదిలినట్లు అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. సాగునీటి విడుదల పట్ల అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు నీరు చేరుతుండటంతో రైతులు తమ సాగు పనులను వేగవంతం చేశారు. సాగు నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, నీటి వృథాను అరికట్టి పొదుపుగా వాడుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా నిఘా నేత్రాలు


### చర్లపల్లిలో భద్రతపై పాలకుల నిర్లక్ష్యం



**నేటి సాక్షి, ఎండపల్లి:** ఎండపల్లి మండలంలోని చర్లపల్లి గ్రామంలో ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పూర్తిగా పనిచేయకపోవడంతో నిఘా వ్యవస్థ దెబ్బతింది. గ్రామంలోని ముఖ్య కూడళ్లు, ప్రధాన రహదారులపై అమర్చిన కెమెరాలు కేవలం అలంకారప్రాయంగా మారడంతో పర్యవేక్షణ కరువైంది. ఇటీవల గ్రామంలో పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పటికీ, కెమెరాలు పనిచేయకపోవడంతో వాటికి సంబంధించిన ఆధారాలు లభించని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రమాదాలకు కారణమైన వారిని గుర్తించడం పోలీసులకు కష్టంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ నిఘా నేత్రాలు కనీస నిర్వహణ లేక నిర్వీర్యమయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సమస్యలు, సాంకేతిక లోపాలు తలెత్తినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పలుమార్లు పోలీసులు కూడా వీటిని సరిచేయాలని సూచించినప్పటికీ, పంచాయతీ పాలకవర్గం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. ఎన్నికల సమయంలో పదవుల కోసం భారీగా ఖర్చు చేసే ప్రజాప్రతినిధులు, ప్రజల భద్రతకు సంబంధించిన సీసీ కెమెరాల మరమ్మతులకు మాత్రం వెనకడుగు వేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ పాలకవర్గం వెంటనే స్పందించి పనిచేయని సీసీ కెమెరాలను బాగు చేయించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. నిఘా వ్యవస్థను పునరుద్ధరించి, ప్రజల భద్రతను పటిష్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## అత్యంత ప్రాచీన విగ్రహం

### నిజరూప దర్శనానికి పోటెత్తిన భక్తులు



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానం శక్తి పీఠంలో కొలువైన 726 సంవత్సరాల అత్యంత ప్రాచీన శ్రీ అభయాంజనేయ స్వామి వారి నిజరూప దర్శనం భక్తులకు కనువిందు చేస్తోంది. హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారి మూల విరాట్‌ను భక్తుల దర్శనార్థం సిద్ధం చేశారు. ఇంతటి పరమ సుందర రూపంతో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం మరెక్కడా ఉండదని భక్తులు విశ్వసిస్తారు. పురాతన కాలం నాటి ఈ విగ్రహాన్ని దర్శించుకోవడానికి పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతున్నారు. ఆలయ ప్రాంగణం హనుమాన్ చాలీసా పారాయణలు, భజనలతో మారుమోగుతోంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

**అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**



**నేటి సాక్షి, మంచిర్యాల:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల 'ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండలం కిష్టంపేట, తాండూర్ గ్రామ పంచాయతీలలో నిర్వహించిన గ్రామ సభలకు ఆయన అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి పంపిన సందేశాన్ని అధికారుల ద్వారా ప్రజలకు చదివి వినిపించారు. ప్రజాపాలనలో భాగంగా పారిశుధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే రాయితీ గ్యాస్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అదనపు కలెక్టర్ వివరించారు. గ్రామసభల ద్వారా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, సంబంధిత శాఖల సమన్వయంతో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు పథకాల ద్వారా పొందిన ప్రయోజనాలను వివరించగా, గ్రామస్థులు విద్యుత్, పంచాయతీ పనులకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**నేటి సాక్షి, మంచిర్యాల:** తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మరియు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్-కామ్) సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీలో నర్సింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఉద్యోగాలు, ఖతార్‌లో నర్సింగ్, గ్రీస్ దేశంలో హాస్పిటాలిటీ, హౌస్ కీపింగ్, వంట మనుషులు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు వంటి పలు విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాలను అర్హత గల మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అభ్యర్థుల వయస్సు 21 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. రెండు, మూడేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, ఎంపికైన వారికి వసతి, ఆహారం, మెడికల్ ఇన్సూరెన్స్ కంపెనీయే కల్పిస్తుందని తెలిపారు. విదేశాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలపై మండల, జిల్లా స్థాయిలో అవగాహన శిబిరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను tomcomglobal@gmail.com కు మెయిల్ చేయవచ్చని లేదా 9440048590, 8919047600 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన వివరించారు. ఈ సమాచారాన్ని వాట్సాప్ గ్రూపులు మరియు నోటీసు బోర్డుల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు.

## లక్ష్మీనరసింహస్వామి శకటోత్సవం



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రోజున ఆలయ ప్రాంగణంలో శకటోత్సవం (బండ్ల ఊరేగింపు) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పురవీధుల గుండా అలంకరించిన ఎడ్లబండ్లు, వాహనాలతో లక్ష్మీనరసింహస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. భక్తుల కోలాహలం, గోవింద నామస్మరణలతో గన్నేరువరం పురవీధులు మారుమోగాయి. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గన్నేరువరం ఎస్సై నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎస్ఐ నూతన చర్చి ప్రారంభోత్సవం



- **రూ.50 వేల విరాళం అందజేసిన నరవ రమాకాంత్ రెడ్డి**

**నేటి సాక్షి, పెద్దకడబూరు:** పెద్దకడబూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చర్చి అభివృద్ధి మరియు నిర్వహణ కోసం ఆయన తన వంతు సహాయంగా రూ. 50,000 నగదును విరాళంగా చర్చి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు సహకారం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన సూచించారు. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ కొనసాగుతాయని రమాకాంత్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. చర్చి నిర్మాణం గ్రామ ప్రజలకు ఒక గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మారి సేవలు అందించాలనే ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు. చర్చి ప్రారంభోత్సవం సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ ప్రతినిధులు, స్థానిక టీడీపీ నాయకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ పోరాటం ఫలించింది






- **కోసిగి మోడల్ స్కూల్ సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

**నేటి సాక్షి, మంత్రాలయం (అభి):** కోసిగి మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారి సమస్యపై అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) చేసిన నిరంతర పోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కింది. గత కొంతకాలంగా పాఠశాలకు వెళ్లే మార్గం అధ్వాన్నంగా మారి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయంపై ఏఐఎస్ఎఫ్ నాయకులు వరుస ఉద్యమాలు చేపట్టి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీరి కృషితోనే నిధులు మంజూరై గురువారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. ఈరేష్, మండల కార్యదర్శి అంజి తమ బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే, నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని హెచ్చరించారు. పరిశీలనలో భాగంగా కొన్ని చోట్ల నాణ్యత లోపాలను గమనించిన నాయకులు, కాంట్రాక్టర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు ఇరువైపులా సరైన విస్తీర్ణంతో నిర్మాణం జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. పనుల్లో నిర్లక్ష్యం వహించినా, నాణ్యత లోపించినా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పనులను అడ్డుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హనుమంతు, విజయ్, కుమార్, మల్లికార్జున, రాము, మహిళా కన్వీనర్లు సుప్రియ, సనా, సంధ్య, రష్మిక మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# ధర్మపురి శివారులో ఘోర ప్రమాదం

## ముగ్గురు యువకుల దుర్మరణం





- **ఆటోను ఓవర్ టేక్ చేస్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన స్నేహితులు**
- **మృతులు మహంకు, మాదాసు అమర్నాథ్, పడాల రిశ్వంత్.. మూడు కుటుంబాల్లో తీరని విషాదం**
- **ఇద్దరు కూతుళ్లను కోల్పోయి.. ఉన్న ఒక్కగానొక్క కొడుకును రోడ్డు ప్రమాదంలో పోగొట్టుకున్న తండ్రి రోదన**



**నేటి సాక్షి, ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి శివారులోని భారత్ పెట్రోల్ బంక్ ఎదుట బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. బైక్‌పై వెళ్తున్న ముగ్గురు స్నేహితులు ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా పెను విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన మహంకు (22), మాదాసు అమర్నాథ్ (22), పడాల రిశ్వంత్ (22) ముగ్గురు ప్రాణ స్నేహితులు. వీరు బుధవారం రాత్రి బైక్‌పై జగిత్యాల వైపు వెళ్లి తిరిగి వస్తుండగా, ధర్మపురి సమీపంలో ముందు వెళ్తున్న ఆటోను ఓవర్ టేక్ చేసే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఎదురుగా అతివేగంతో వస్తున్న లారీ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి ముగ్గురు యువకులు చెల్లాచెదురుగా పడి అక్కడికక్కడే మరణించారు. ఆటోను కూడా లారీ ఢీకొట్టడంతో అది రోడ్డు పక్కకు బోల్తా పడింది.

**తండ్రి గుండెకోత:**

మృతుల్లో ఒకరైన మాదాసు అమర్నాథ్ తండ్రి లచ్చన్న పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. గతంలోనే ఆయన ఇద్దరు కుమార్తెలు అనారోగ్యంతో మరణించగా, ఉన్న ఒక్కగానొక్క కుమారుడు అమర్నాథ్ కూడా ఈ ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన ఆవేదనకు హద్దుల్లేవు. తన కొడుకు మృతదేహంపై పడి ఆయన రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న ధర్మపురి, వెల్గటూరు ఎస్సైలు మహేశ్, రమేశ్, ఉదయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI





# ఐపీఎల్ 2026లో అరుదైన సంఘటనలు

**అభిమానులను ఆశ్చర్యపరుస్తోన్న ఫలితాలు!**

**ఐపీఎల్ 2026 ఆరంభం నుంచే ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు**

**అభిమానులకు అసలైన మజాను అందిస్తున్న ఐపీఎల్**

**ఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభం నుంచే ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు క్రికెట్ అభిమానులకు అసలైన మజాను అందిస్తున్నాయి. బ్యాటర్ల ధనాధన్ ఇన్నింగ్స్, బౌలర్ల మ్యాజిక్ బౌలింగ్, సూపర్ క్యాచ్‌లతో ఫీల్డర్ల విన్యాసాలు అభిమానులను కట్టిపడేశాయి. అయితే తొలి నాలుగు మ్యాచ్‌లలో చోటుచేసుకున్న కొన్ని ఆసక్తికరమైన సంఘటనలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఈ నాలుగు మ్యాచ్‌లలో ఒకే తరహా ఫలితాలు రావడంపై అభిమానుకు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్ 2026లోని మొదటి నాలుగు మ్యాచ్‌ల్లో ఓ ట్రెండ్ స్పష్టంగా కనిపించింది. అన్ని మ్యాచ్‌ల్లో హోమ్ జట్లు విజయం సాధించాయి. అదే సమయంలో చేజింగ్ చేసిన జట్లే గెలిచాయి. అంతేకాదు ప్రతి మ్యాచ్‌లో టాస్ గెలిచిన కెప్టెన్ ఫీల్డింగ్ ఎంచుకుని.. విజయం సాధించాడు. ఈ మూడు అంశాలు నాలుగు మ్యాచ్‌ల్లో ఒకేలా పునరావృతం కావడం విశేషం. ఈ మ్యాచ్‌ల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ జట్లు విజేతలుగా నిలిచాయి. ఓడిన జట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ ఉన్నాయి. ఈ తరహా అరుదైన ఫలితాలు క్రికెట్‌లో చాలా అరుదుగా కనిపిస్తాయి. సాధారణంగా ప్రతి మ్యాచ్‌లో పరిస్థితులు, పిచ్, జట్టు ప్రదర్శన మారుతూ ఉంటాయి. కానీ ఈసారి మాత్రం నాలుగు మ్యాచ్‌ల్లో ఒకే విధమైన ఫలితాలు రావడం అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది. ఐపీఎల్ 2026 ప్రారంభమే ఇలా ఆసక్తికరంగా సాగుతుండటం ఈ సీజన్‌పై మరింత ఉత్కంఠను పెంచుతోంది. ఇక ముందు మ్యాచ్‌ల్లో కూడా ఇలాంటి ట్రెండ్స్ కొనసాగుతాయా లేదా అనే ఆసక్తి అందరిలో నెలకొంది.

# ఈడెన్ లో 'సన్ రైజర్స్' సంచలనం

**కేకేఆర్ పై 65 పరుగుల భారీ తేడాతో ఎస్ఆర్ హెచ్ ఘన విజయం**

**క్లాసెన్, అభిషేక్, హెడ్ విధ్వంసకర బ్యాటింగ్.. 226 పరుగుల స్కోరు**

**ఉనద్కత్, మలింగ దెబ్బకు 161 పరుగులకే కుప్పకూలిన కోల్ కతా**




**కోల్‌కతా, ఏప్రిల్ 2:** ఐపీఎల్ తాజా సీజన్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ ఆర్ హెచ్) అదరగొట్టింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్ కతా నైట్ రైడర్స్ (కే కే ఆర్) తో జరిగిన మ్యాచ్ లో ఆల్ రౌండ్ షోతో సత్తా చాటింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి 65 పరుగుల భారీ తేడాతో కే కే ఆర్ ను సొంత గడ్డపైనే చిత్తు చేసింది. టాస్ గెలిచిన కే కే ఆర్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు దిగిన ఎస్ ఆర్ హెచ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 226 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన కోల్ కతా 16 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌట్ అయింది.

**దంచికొట్టిన టాప్ ఆర్డర్..**

తొలుత బ్యాటింగ్ చేపట్టిన సన్ రైజర్స్ బ్యాటర్లు ఆరంభం నుంచే ఎడాపెడా బౌండరీలతో చెలరేగారు. ఓపెనర్ ట్రావిస్ హెడ్ కేవలం 21 బంతుల్లోనే 46 పరుగులు చేసి ఇన్నింగ్స్ కు అద్భుతమైన ఊపు తీసుకొచ్చాడు. యువ సంచలనం అభిషేక్ శర్మ సైతం అదే పంథాలో విధ్వంసం సృష్టించాడు. కేవలం 21 బంతుల్లో 48 పరుగులు సాధించి స్కోరు బోర్డును రాకెట్ వేగంతో పరుగులు పెట్టించాడు. మిడిలార్డర్ లో వికెట్ కీపర్ హెన్రిచ్ క్లాసెన్ బాధ్యతాయుతంగా ఆడుతూనే భారీ షాట్లతో అలరించాడు. 35 బంతుల్లో 52 పరుగులతో అర్ధ శతకం పూర్తి చేసుకుని ఎస్ ఆర్ హెచ్ భారీ స్కోరుకు బాటలు వేశాడు. కే కే ఆర్ బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబానీ 41 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి సన్ రైజర్స్ జోరుకు కాస్త కళ్లెం వేసే ప్రయత్నం చేశాడు. వైభవ్ అరోరా 2 వికెట్లు, అనుకూల్ రాయ్ ఒక వికెట్ దక్కించుకున్నారు.

**తేలిపోయిన కేకేఆర్ బ్యాటర్లు..**

227 పరుగుల కష్టమైన లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన కోల్ కతా నైట్ రైడర్స్ కు ఆదిలోనే కష్టాలు మొదలయ్యాయి. సన్ రైజర్స్ బౌలర్ల కట్టుదిట్టమైన బంతులకు కే కే ఆర్ బ్యాటర్లు పెవిలియన్ కు క్యూ కట్టారు. అంగ్ క్రిష్ రఘువంశీ 29 బంతుల్లో 52 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. చివర్లో రింకూ సింగ్ (25 బంతుల్లో 35 పరుగులు), ఓపెనర్ ఫిన్ అలెన్ (7 బంతుల్లో 28 పరుగులు) మెరుపులు మెరిపించినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రన్ రేట్ భారీగా పెరిగిపోవడంతో ఒత్తిడికి లోనైన కే కే ఆర్ 16 ఓవర్లలోనే 161 పరుగులకు కుప్పకూలింది. ఎస్ ఆర్ హెచ్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశారు. పేసర్ జయదేవ్ ఉనద్కత్ అద్భుతంగా బౌలింగ్ చేసి కేవలం 21 పరుగులకే 3 వికెట్లు తీసి కోల్ కతా పతనాన్ని శాసించాడు. ఈషాన్ మలింగ 2, నితీశ్ కుమార్ రెడ్డి 2 వికెట్లు పడగొట్టి జట్టు ఘన విజయంలో కీలక పాత్ర పోషించారు. పక్కా ప్రణాళికతో బరిలోకి దిగిన సన్ రైజర్స్ ఏ దశలోనూ కోల్ కతాకు కోలుకునే అవకాశం ఇవ్వలేదు.





# ఐపీఎల్‌లో ఆడేందుకు కోర్టును ఆశ్రయించిన శ్రీలంక బౌలర్

**న్యూఢిల్లీ:** శ్రీలంక క్రికెటర్ నువాన్ తుషార కోర్టును ఆశ్రయించారు. ఐపీఎల్‌లో ఆడేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కొలంబో జిల్లా కోర్టులో అతను కేసు దాఖలు చేశాడు. ఐపీఎల్‌లో ఆడే హక్కును కల్పించాలని లంక కోర్టును అతను కోరాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆడేందుకు లంక క్రికెట్ బోర్డు నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ తెచ్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఫిట్‌నెస్ సరిగా లేని కారణంగా తుషారకు నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇచ్చేందుకు బోర్డు తిరస్కరించింది. దీంతో ఐపీఎల్‌లో ఆడేందుకు అతనికి క్లియరెన్స్ దక్కలేదు. వాస్తవానికి 31 ఏళ్ల క్రికెటర్ రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు జట్టుతో కాంట్రాక్టు కుదుర్చుకున్నాడు. కానీ లంక బోర్డు అనుమతి ఇవ్వకపోవడంతో ఇప్పుడు అతను కోర్టును ఆశ్రయించాడు. ఏప్రిల్ 9వ తేదీన ఈ కేసుపై విచారణ జరగనున్నది.




# లుంగి ఎంగిడి అద్భుత బంతి..

**నికోలస్ పూరన్ మైండ్ బ్లాక్ అయిందిగా!**

**10 జట్లు ఒక్కో మ్యాచ్ ఆడేశాయి**

**ఎన్నో అద్భుత క్షణాలను ఆస్వాదించాం**

**ప్రత్యేకంగా నిలిచిన లుంగి ఎంగిడి బంతి**

**నికోలస్ పూరన్ మైండ్ బ్లాక్ అయిందిగా**

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో ప్రారంభమై ఐదు రోజులు కాగా.. అన్ని జట్లు ఒక్కో మ్యాచ్‌ను ఆడేశాయి. ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల్లో ఎన్నో అద్భుత క్షణాలను మనం ఆస్వాదించాం. అద్భుత బ్యాటింగ్, సూపర్ క్యాచ్, బెస్ట్ బౌలింగ్ గణాంకాలు నమోదు కాగా.. బుధవారం జరిగిన మ్యాచ్‌లో నమోదైన ఒక బంతి మాత్రం ప్రత్యేకంగా నిలిచింది. దక్షిణాఫ్రికా పేసర్ లుంగి ఎంగిడి వేసిన ఆ అద్భుత డెలివరీ ఇప్పటి వరకు ఈ సీజన్‌లో 'బెస్ట్ బాల్'గా నిలిచింది. మొట్టమొదటిసారి ఐపీఎల్‌లో ఢిల్లీ తరఫున ఆడుతున్న లుంగి ఎంగిడి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. లక్నో సూపర్ జెయింట్స్ స్టార్ బ్యాటర్ నికోలస్ పూరన్‌ను ఔట్ చేసిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. బంతిని ముందుకు వచ్చి ఆడాలని ప్రయత్నించిన పూరన్.. ఎంగిడి వేసిన యార్కర్‌కు బలైపోయాడు. యార్కర్ లెంత్‌లో కచ్చితంగా పడిన ఆ బంతి పూరన్ ఏమీ చేయలేకపోయాడు. సరైన టైమింగ్‌తో డిఫెన్స్ ఆడకపోతే.. ఎలాంటి బ్యాటర్ అయినా ఔట్ అవ్వాల్సిందే అన్నట్లుగా ఆ డెలివరీ నిలిచింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'లుంగి ఎంగిడి అద్భుత బంతి', 'నికోలస్ పూరన్ మైండ్ బ్లాక్ అయిందిగా' అంటూ కామెంట్స్ చేస్తున్నారు.



## గొప్ప సినిమాలో భాగమైనందుకు
# గర్వంగా ఉంది : కాజల్



పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త విరామం ఇచ్చిన టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్, ఇప్పుడు ఒక భారీ ప్రాజెక్టుతో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఇటీవల 'భగవంత్ కేసరి', 'కన్నప్ప' వంటి చిత్రాల్లో మెరిసిన ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు భారతీయ చలనచిత్ర పరిశ్రమలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'రామాయణ' చిత్రంలో భాగమైనట్లు అధికారికంగా ప్రకటించింది. బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ నితీష్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పౌరాణిక గాథలో కాజల్ కీలక పాత్ర పోషిస్తోంది.

గత కొద్దికాలంగా ఈ సినిమాలో కాజల్ రావణాసురుడి భార్య మండోదరి పాత్రలో కనిపించనుందని వార్తలు రాగా, తాజాగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా ఆ వార్తలను నిజం చేసింది. రామాయణ గ్లింప్స్‌ను షేర్ చేస్తూ.. "ప్రతి తరం శ్రీరాముడి పేరుతోనే పెరిగారు. ఇప్పుడు యావత్ ప్రపంచం మొత్తం మర్యాద పురుషోత్తముడైన ఆ రాముడిని దర్శించుకోబోతోంది. ఇలాంటి ఒక గొప్ప దృశ్యకావ్యంలో నేను కూడా భాగమైనందుకు చాలా గర్వపడుతున్నాను" అని ఎమోషనల్ నోట్ రాసుకొచ్చింది. అయితే, కాజల్‌ను సీత పాత్రలో చూడాలనుకున్న అభిమానులు, ఆమె మండోదరిగా నటిస్తుండటంతో కొంత నిరాశ వ్యక్తం చేసినా, ఆమె నటనపై మాత్రం భారీ అంచనాలు పెట్టుకున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ డియోల్ వంటి దిగ్గజ నటులు నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. మొదటి భాగం ఈ ఏడాది దీపావళి కానుకగా థియేటర్లలో సందడి చేయనుండగా, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. చందమామ కాజల్ ఈ క్రేజీ ప్రాజెక్టులోకి ఎంట్రీ ఇవ్వడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.



## ఆ చూపు.. ఆ వయ్యారం..
## ఎల్లో డ్రెస్సులో పాయల్ అండ్ క్యూట్ షో

పాయల్ రాజ్ పుత్ తాజాగా షేర్ చేసిన ఎల్లో అవుట్‌ఫిట్ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. క్యూట్ స్మైల్‌తో మెరిసిపోతూనే, తన నడుము సొగసును వయ్యారంగా ప్రదర్శిస్తూ ఆమె ఇచ్చిన ఫోజులు అభిమానులను ఫిదా చేస్తున్నాయి. ఈ ట్రెండీ అండ్ గ్లామరస్ లుక్‌తో ప్రగ్యా సోషల్ మీడియాలో సెగలు రేపుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

## సెన్సార్ పూర్తి చేసుకున్న
# డెకాయిట్

వరుస విజయాలతో మంచి జోష్‌లో కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్న హీరో అడవి శేష్ తాజాగా 'డెకాయిట్' చిత్రంలో హీరోగా నటించారు. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. సినిమా విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో, చిత్రబృందం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసింది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి U/A సర్టిఫికెట్ జారీ చేసినట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మించిన ఈ చిత్రానికి షానీల్ డియో దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.




## నేటి నుంచి టాలీవుడ్‌లో
## పర్సంటేజీ విధానం ప్రారంభం




టాలీవుడ్ ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య చాలాకాలంగా కొనసాగుతున్న 'రెంటల్' వివాదానికి తెరపడింది. తెలంగాణలోని థియేటర్ యాజమాన్యాలు ఇకపై రెంటల్ విధానాన్ని రద్దు చేసి, వసూళ్లలో వాటా పంచుకునే 'పర్సంటేజీ సిస్టమ్' అమలు చేయాలని నిర్ణయించాయి. ఈ కొత్త విధానానికి రాష్ట్రంలోని 23 ప్రధాన థియేటర్లు ఇప్పటికే అంగీకారం తెలిపాయి. ఏప్రిల్ 3 నుంచి ఈ విధానం అధికారికంగా అమల్లోకి రానుంది. దీంతో డిస్ట్రిబ్యూటర్లపై ఉన్న ఆర్థిక భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. మఇప్పటి వరకు సినిమా ఫలితంతో సంబంధం లేకుండా థియేటర్లకు స్థిర అద్దె చెల్లించాల్సి వచ్చేది. సినిమా ఫ్లాప్ అయితే డిస్ట్రిబ్యూటర్లు భారీ నష్టాలను ఎదుర్కొనేవారు. కానీ కొత్త విధానంలో వసూళ్ల ఆధారంగా ఆదాయం పంచుకుంటారు. సినిమా హిట్ అయితే లాభాలు ఇద్దరికీ దక్కుతాయి, లేకపోతే నష్టాన్ని కూడా భాగస్వామ్యం చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా చిన్న, మధ్యస్థాయి సినిమాలకు ఈ మార్పు కొంత ఉపశమనం కలిగించనుంది.

## శింబుతో
## మీనాక్షి రోమాన్స్



కోలీవుడ్ స్టార్ హీరో శింబు ప్రస్తుతం 'అరసన్' షూటింగ్‌లో నిమగ్నమై ఉన్నారు. ఈ మధ్యలోనే ఆయన కొత్త ప్రాజెక్ట్ STR 51పై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాను యువ దర్శకుడు అశ్వత్ వైరముత్తు తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో శింబుకు జోడీగా ముగ్గురు హీరోయిన్లను తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నట్లు టాక్. ఇప్పటికే మీనాక్షి చౌదరి పేరు ఫైనల్ అయ్యిందని ప్రచారం జరుగుతుండగా, రుక్మిణి వసంత్, మృణాల్ ఠాకూర్‌లతో కూడా చర్చలు కొనసాగుతున్నాయట. ఇక అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించే అవకాశముందన్న వార్త సినిమాపై మరింత హైప్ తీసుకొస్తోంది. అయితే హీరోయిన్‌ల ఎంపికపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది.



## లైట్ పింక్ గౌన్‌లో వేదిక గ్లామర్ షో..

తన నటనతో పాటు అందంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి వేదిక తమిళ సినిమాల ద్వారా కెరీర్‌ను ప్రారంభించి మంచి గుర్తింపు పొందింది. పలు చిత్రాల్లో నటించిన ఈ బ్యూటీ ఇటీవలి కాలంలో వెబ్ సిరీస్‌లలో కూడా తన సత్తా చాటుతోంది. ఇటీవల 'యక్షిణి' వెబ్ సిరీస్‌లో కనిపించి ప్రేక్షకులను మెప్పించింది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉండే వేదిక, తరచూ తన ఫోటోషూట్‌లతో ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఫోటోలలో లైట్ పింక్ కలర్ స్టోన్ ఎంబ్రాయిడరీ లాంగ్ గౌన్‌లో వేదిక స్టైలిష్‌గా మెరిసింది. స్లీవ్‌లెస్ డిజైన్, చిన్ని డీటెయిల్స్‌తో ఆమె లుక్ మరింత గ్లామర్‌ను హైలైట్ చేస్తూ అభిమానులను ఆకర్షిస్తోంది.



## రూమర్స్‌కు చెక్ పెట్టిన రామ్ చరణ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదలపై గత కొన్ని రోజులుగా వస్తున్న వాయిదా వార్తలకు స్వయంగా ఆయన క్లారిటీ ఇచ్చారు. మొదట ఏప్రిల్ 30న రిలీజ్ ప్లాన్ చేసిన ఈ సినిమా షూటింగ్ ఆలస్యం కారణంగా జూన్‌కు మారిందన్న ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. అయితే ఈ రూమర్స్‌పై స్పందించిన రామ్ చరణ్, సినిమా వాయిదా పడడం లేదని స్పష్టంగా తెలిపారు. 'రాకాస' మూవీ టీమ్‌తో జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని చెప్పి, తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని అభిమానులకు సూచించారు. ఇకపోతే, షూటింగ్ ఇంకా పూర్తి కాలేదనే టాక్ నేపథ్యంలో సినిమా సమయానికి సిద్ధమవుతుందా అన్న సందేహాలు మాత్రం కొనసాగుతున్నాయి. అయినప్పటికీ చరణ్ ఇచ్చిన క్లారిటీతో మెగా అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. జగపతి బాబు, దివ్యేందు శర్మ, శివరాజ్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

TGTEL/25/A1737 | NETI SAKSHI

# శంకర్‌పల్లి మున్సిపాలిటీలో ప్రజా పాలన



- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జరిగిన 14వ వార్డు సభకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువారం మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో వార్డు సభలు జరిగాయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలు, అమలులో ఉన్న పథకాల వివరాలను, లబ్ధిదారుల వివరాలు ప్రజలకు తెలియజేయడం కోసం ఈ వార్డు సభలను నిర్వహించడం జరిగిందన్నారు. ఆయా వార్డుల ప్రజలు తమ సమస్యలను 14వ వార్డు శ్రీరామ్ నగర్ కాలనీవాసులు వార్డు సభలలో తెలియజేశారన్నారు. అధికారులు, చైర్ పర్సన్, కౌన్సిలర్లు ప్రజలు తెలిపిన సమస్యలను త్వరగా పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ బి. పూర్ణిమ, మున్సిపల్ కమిషనర్ యోగేష్, మున్సిపల్ మేనేజర్ అంజన్ కుమార్, ఆయా వార్డుల కౌన్సిలర్లు ప్రజలు పాల్గొన్నారు.

# పూర్ణాహుతితో ముగిసిన హనుమాన్ దీక్ష

**నేటి సాక్షి, చేవెళ్ల :** హనుమత్ దీక్షను నియమ నిష్టలతో పూర్తి చేయడం ఆనందంగా ఉంది అని భక్తులు తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం చేవెళ్లలోని సాయిబాబా మందిర ప్రాంగణంలో దీక్ష ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. దీక్ష పూర్తిచేసుకున్న వారు సంప్రదాయ ప్రకారం విరమణ క్రతువులు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు అమిత్ శెట్టి చేతుల మీదుగా హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. వేద మంత్రాల నడుమ జరిగిన ఈ కార్యక్రమం భక్తిమయంగా సాగింది. ఈ సందర్భంగా సమస్త మానవాళికి శాంతి చేకూరాలని, ఆయురారోగ్యాలతో అష్టసౌభాగ్యాలతో ఉండాలని శ్రీరామచంద్రుడు ని, వీర హనుమాన్ ని ప్రార్థించినట్లు తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం మాల విసర్జనకు భక్తులు సిద్ధమయ్యారు. కర్ణాటకలోని కిష్కింద అంజని పర్వతంతో పాటు కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంకు వెళ్లాలని సంకల్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఘనపూర్ గ్రామానికి చెందిన వెంకటయ్య ఏర్పాటు చేశారు. ఈ



కార్యక్రమంలో మాలధారులు సురేందర్, గోంగూపల్లి శ్రీపాల్ చంద్రశేఖర్ మహేందర్ గొంగుపల్లి శేఖర్, సాయిబాబా ఆలయ చైర్మన్ అర్థ శేఖర్ రెడ్డి, స్థానిక ప్రముఖులు సున్నపు వసంతం, సీనియర్ పాత్రికేయులు కడమంచి ఆనంద్, బేగరి శ్రీనివాస్, ఆలయ నిర్వాహకులు వడ్డే యాదయ్య, గుడిసె శ్రీనివాస్ భక్తులు పాల్గొన్నారు.

# అమరావతి చట్టబద్ధతపై టిడిపి శ్రేణులు సంబరాలు



- ఆంధ్రుల ఏకైక రాజధాని-అమరావతి
- టపాసుల మోతతో విజయోత్సవ కార్యక్రమం

**నేటి సాక్షి, చౌడేపల్లి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం స్థానిక బస్టాండ్ లో టపాసుల మోతతో ప్రాధాన మంత్రి నరేంద్రమోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ .చిత్రపటాలకు పాలాబిషేకం చేశారు .మండల ప్రధాన కార్యదర్శి బోయకొండ సుబ్రమణ్యం(సుబ్బు) ఆద్వర్యంలో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు పొన్నా సోమశేఖర్, శ్రీధర్ రాజు(గిరి రాజు), పాళ్యం రెడ్డి,రాధాకృష్ణ, పరికిదొన చెంగ్రాయలు, విజయభాస్కర్ రెడ్డి,యనమసామన పల్లి నాగరాజ రెడ్డి, ధర్మ తేజ భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్ ప్రజాదరణను చూసి ఓర్వలేకే విమర్శలు

- పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ నేతలు.. నీతులు చెప్పడం హాస్యాస్పదం
- ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదే - కాంగ్రెస్ ధ్వజం



**నేటి సాక్షి తొగుట (వడ్డే నర్సింలు):** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేకే బీఆర్ఎస్ నాయకులు అనవసర విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ వెంకట్రావుపేట గ్రామ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్ మండిపడ్డారు. గురువారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి వంటి హామీలతో ప్రజలను మోసం చేసిన వారు ఇప్పుడు మాట్లాడటం సరికాదన్నారు. తలాపునే మల్లన్నసాగర్ ఉన్నా, పదేళ్ల కాలంలో ఉప కాలువలు నిర్మించడంలో విఫలమైన బీఆర్ఎస్ నేతలు సాగునీటి గురించి మాట్లాడటం 'దయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రాబోయే రోజుల్లో ప్రతి కుటుంబానికి 'కుటుంబ బీమా' పథకాన్ని అందించబోతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పంది రాజు, మండల పార్టీ ఉపాధ్యక్షులు బెజ్జనమైన అనిల్, వార్డు సభ్యులు కల్లేపు భాను చందర్, యూత్ అధ్యక్షులు కల్లేపు నరేష్, నాయకులు బెజ్జనమైన రాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసమే ప్రభుత్వ పథకాలు

- చొక్కారావుపల్లెలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' గ్రామ సభ.. పథకాలపై అవగాహన
- గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ పిలుపు

**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలంలోని చొక్కారావుపల్లె గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' గ్రామ సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అరుకొంత గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు సామాన్యులకు ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కేవలం అధికారులతోనే సాధ్యం కాదని, ఇందులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా గ్రామాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రజా పాలనలో భాగంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజా పాలన

**ప్రగతి ప్రణాళిక 99' గ్రామ సభలు**



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మొత్తం 17 గ్రామ పంచాయతీలలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఈ ప్రణాళికలో భాగంగా గురువారం ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ప్రజల భాగస్వామ్యంతో కీలక తీర్మానాలు చేశారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, ప్రజాప్రతినిధులు.. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని నిర్ణయించారు. అలాగే గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమాల్లో గన్నేరువరం సర్పంచ్ రంగానవేని లక్ష్మీనరసింహాం, మైలారం సర్పంచ్ గాలిపెల్లి పోశవ్వ, సాంబయ్యపల్లి సర్పంచ్ గడ్డం రమ్య మరియు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామాల్లోని పెండింగ్ సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల వేగవంతంపై అధికారులతో చర్చించారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సభల్లో మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాన్గల్‌లో గ్రామ సభ

**సంక్షేమ పథకాలపై అవగాహన. సర్పంచ్ పిట్ల సత్తయ్య**



**నేటి సాక్షి, తొగుట (వడ్డే నర్సింలు):** తొగుట మండలంలోని కాన్గల్ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన. ప్రగతి ప్రణాళిక 99' రోజులలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ పిట్ల సత్తయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ మరియు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా ఇప్పటికే 27 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, రెండో విడతలో మరో 30 ఇండ్లు తీసుకువచ్చేందుకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు కృషి చేస్తున్నారని సర్పంచ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అందుతున్న పథకాల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కాన్గల్ గ్రామాభివృద్ధికి నిరంతరం తోడ్పాటునందిస్తున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డికి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, హెచ్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిక్షపతి, ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ మరియు గ్రామ యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి అండగా స్వాములు

**నేటి సాక్షి, మేడిపల్లి:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా భక్తితో పాటు మానవత్వం పరిమళించింది. గ్రామానికి చెందిన రొండి జల అనే నిరుపేద మహిళ తన కూతురితో కలిసి నివసిస్తూ, కనీస అవసరాలకు కూడా ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన కోటగిరి బాలగౌడ్ నిలయం హనుమాన్ స్వాములు వారికి అండగా నిలిచారు. ఎటువంటి పిలుపు లేకుండానే స్వచ్ఛందంగా స్పందించి ఆ కుటుంబానికి తమ వంతు సహాయం అందజేసి ఉదారతను చాటుకున్నారు. గురువారం హనుమాన్ జయంతి పర్వదినం రోజున ఆ నిరుపేద కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యవసర సరుకులను స్వాములు అందజేశారు. ఈ సందర్భంగా మాలధారులు మాట్లాడుతూ.. భక్తి అంటే కేవలం దేవాలయంలో పూజలు చేయడం మాత్రమే కాదని, ఆపదలో ఉన్న తోటి మనిషికి చేయూతనివ్వడంలోనే అసలైన దైవత్వం ఉందని పేర్కొన్నారు. హనుమంతుడి ఆశీస్సులు ఇలా సేవా రూపంలో ప్రత్యక్షమవ్వడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. కోటగిరి బాలగౌడ్ నిలయం స్వాములు చేసిన ఈ మంచి పనిని కట్లకుంట గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

## ముగిసిన పది పరీక్షలు



**నేటి సాక్షి, చౌడేపల్లి పుంగనూరు నియోజకవర్గ:** రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా జరుగుతున్న పదవ తరగతి పరీక్షలు జరుగుతున్నాయి.పుంగనూరు పట్టణంలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగాయని ఎంఈవో నటరాజరెడ్డి తెలిపారు.. మొత్తంగా గురువారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు గాను పుంగనూరు మండలంలో 8 పరీక్షా కేంద్రాలు లలో 1405 మంది పరీక్ష రాయాల్సివుంది. కానీ అందులో 1388 మంది విద్యార్థులు హాజరైనారు. మిగిలిన 17 మంది విద్యార్థులు గైర్హాజరు అయినారు. అదేవిధంగా ఈరోజు పరీక్ష కేంద్రాలలో పరీక్షలు సిట్టింగ్ స్క్వాడ్ పర్యవేక్షణలో జరిగాయి. భాష్యం స్కూల్, నారాయణ స్కూల్ శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాలల కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ వారు సందర్శించడం జరిగినది.అలాగే చౌడేపల్లిలో గల రెండు సెంటర్లలో విజయవాణి పాఠశాలలో 256 మదికి గాను 254 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చౌడేపల్లి నందు 300 మందికి గాను 299 మంది హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి కేశవరెడ్డి తెలియజేశారు. మొత్తం పైన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

## సీతారాముల కళ్యాణం



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** చౌడేపల్లిలో సీతారాముల కళ్యాణం కన్నుల పండగ వేద పండితుల ఆధ్వర్యంలో జరిగింది.గురువారం స్థానిక హరి మందిరంలో సీతారాములకు వేద పండితులు పంచామృతాభిషేకాల నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలతో శాస్త్రోత్తంగా స్వామి వారికి కళ్యాణం నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని కళ్యాణం తిలకించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయదారులుగా బొగ్గారపు సుబ్రహ్మణ్యం కుటుంబంలో వ్యవహరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## హనుమాన్ శోభాయాత్ర

### జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిన కాగజ్ నగర్



**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్ :** కాగజ్ నగర్ పట్టణంలో హనుమాన్ జయంతి పురస్కరించుకుని హనుమాన్ శోభాయాత్ర ఘనంగా ప్రారంభమైంది.హిందూ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శోభాయాత్రను సిర్పూర్ మాజీ శాసన సభ్యులు కోనేరు కోనప్ప ప్రారంభించారు. కార్యక్రమానికి భారీగా భక్తులు, యువత, స్థానిక నాయకులు హాజరై భక్తి గీతాలు, జై శ్రీరామ్ నినాదాలతో పట్టణాన్ని మార్మోగించారు.. అనంతరం కాగజ్ నగర్ రాజీవ్ గాంధీ చౌరస్తా లో కోనేరు కోనప్ప భక్తులకు మజ్జిగ పంపిణీ చేసి వారి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఛైర్మెన్ కోనేరు కృష్ణ రావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డాక్టర్ అనిత శ్రీనివాస్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల సందడి





**నేటిసాక్షి, తిరుమలాయపాలె,(రుద్రరాజు):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం బచ్చోడు సెక్షన్ పరిధిలోని 21 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో ప్రతి గ్రామపంచాయతీకి ఒక అధికారి హాజరైన 'గృహజ్యోతి' పథకం అమలు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విస్తరణ, కొత్త స్తంభాల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ మునీర్ పాషా,రాజశేఖర,భాస్కర్,వీరభద్రం చారి, వెంకటేశ్వరావు,కిషోర్,రామయ్య, మహేష్, వెంకన్న, విక్రమ్,కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ గేట్ల తొలగింపునకు నోటీసులు

- రహదారులను ఆక్రమించిన దుకాణ సముదాయాలకు మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక
- మార్చి 29న 'నేటి సాక్షి'లో ప్రచురితమైన కథనంతో కదిలిన మున్సిపల్ యంత్రాంగం
- స్వచ్ఛందంగా తొలగించకపోతే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ బి. తిరుపతి వెల్లడి
- పట్టణ సుందరీకరణకు, ట్రాఫిక్ సౌకర్యానికి ఆటంకం కలిగిస్తే సహించేది లేదని స్పష్టం

**నేటి సాక్షి, కాగజ్‌నగర్ (అహ్మద్‌పాషా):** కాగజ్‌నగర్ పట్టణంలో ప్రధాన రహదారులను ఆక్రమించి అక్రమంగా ఏర్పాటు చేసిన గేట్లు, దుకాణ సముదాయాల ఆక్రమణలపై మార్చి 29న 'నేటి సాక్షి' ప్రచురించిన వార్తకు మున్సిపల్ అధికారులు వేగంగా స్పందించారు. రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల ముందు గేట్లు, ఇతర కట్టడాలు నిర్మించిన ఆక్రమణదారులకు మున్సిపల్ కమిషనర్ బీ తిరుపతి గురువారం నోటీసులు జారీ చేశారు. మున్సిపల్ స్థలాలను, రహదారులను ఆక్రమించి నిర్మించిన గేట్లను వెంటనే స్వచ్ఛందంగా తొలగించాలని కమిషనర్ ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు. ఒకవేళ నిర్ణీత గడువులోగా వీటిని తొలగించని పక్షంలో మున్సిపల్ యంత్రాంగమే వాటిని తొలగిస్తుందని, అందుకు అయ్యే ఖర్చును కూడా ఆక్రమణదారుల నుంచే వసూలు చేస్తామని హెచ్చరించారు. పట్టణ సుందరీకరణకు, ట్రాఫిక్ సౌకర్యానికి ఆటంకం కలిగిస్తే సహించేది లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల 'నేటి సాక్షి'లో ఈ ఆక్రమణల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సమగ్ర కథనం ప్రచురితమైంది. ఈ వార్తతో అధికారులు కదిలి తక్షణ చర్యలు చేపట్టడం పట్ల కాగజ్‌నగర్ పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం గళం వినిపిస్తున్న 'నేటి సాక్షి'కి, సానుకూలంగా స్పందించిన మున్సిపల్ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**'నేటి సాక్షి'కి స్పందన**



పురపాలక సంఘ కార్యాలయము కాగజ్ నగర్
కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా

తేది: 02-04-2026

పత్రిక ప్రకటన

కాగజ్‌నగర్ పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, పట్టణంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండటం మరియు తరచుగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ప్రజల సౌకర్యార్థం రహదారులపై ఉన్న అక్రమ ఆక్రమణలను తొలగించడం అవసరమైంది.

క్రింది ప్రదేశాలలో ఉన్న రహదారులపై ఆక్రమణలను వెంటనే తొలగించవలెను:

1. తెలంగాణ తల్లి చౌరస్తా నుండి బట్టుపల్లి చౌరస్తా వరకు ఉన్న రహదారి.
2. రాజీవ్ చౌక్ నుండి అంబేద్కర్ చౌక్, పొట్టి శ్రీరాములు చౌరస్తా మీదుగా సంజీవయ్య కాలనీ వరకు
3. అంబేద్కర్ చౌక్ నుండి ఎల్లగౌడ్ తోట ప్రభుత్వ ఆసుపత్రి వరకు.
4. రైల్వే ...నగర్ సమీపములో ఇరువైపుల ఉన్న రహదారులపై ఉన్న దుకాణాలు.

...లో ఉన్న దుకాణదారులు, వీధి వ్యాపారులు మరియు అక్రమ సంబంధిత యజమానులు ... వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవలెను. లేని యెడల తెలంగాణ మున్సిపల్ చట్టం, ...గిన చర్యలు తీసుకోబడును.

కమిషనర్
కాగజ్‌నగర్ మున్సిపాలిటీ



కాగజ్‌నగర్ మార్కెట్‌లో అక్రమ గేట్లు తొలగించాలి

- ప్రజా రహదారులు ప్రైవేట్ అడ్డాలుగా మారుతున్నాయి..
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం.. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్

# మరకత శివాలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం

- 60 మందికి ఆరోగ్య పరీక్షలు
- సిద్ధార్థ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు.. ఉచితంగా మందుల పంపిణీ
- గ్రామీణ ప్రాంత పేదల ఆరోగ్యమే లక్ష్యం - మేనేజింగ్ డైరెక్టర్ డా. సుజిత సిద్ధార్థ రెడ్డి



**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ ప్రాంగణంలో గురువారం సిద్ధార్థ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుజిత సిద్ధార్థ రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిన ఈ శిబిరంలో సుమారు 60 మంది రోగులకు నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రీషియన్ విభాగాలకు చెందిన వైద్యులు డాక్టర్ అజయ్ కుమార్, శ్రీకాంత్, రబ్బాని పాల్గొని రోగులకు సమగ్ర వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ (GRBS), బరువు వంటి పరీక్షలతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో అరుదుగా లభించే స్పెషలిస్ట్ వైద్య సేవలు ఒకే చోట అందడంతో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైద్య పరీక్షల అనంతరం హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వైస్ చైర్మన్ శేఖర్ హాస్పిటల్ బృందాన్ని శేష వస్త్రంతో ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మెడికల్ మరియు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గోర్ మాటి ఆత్మగౌరవ సదస్సుకు జోష్

- తండాల్లో పోస్టర్ల ఆవిష్కరణ!
- భావసంగ్ మహారాజ్ కల్యాణాన్ని విజయవంతం చేయాలి - లంబాడీల ఐక్య వేదిక పిలుపు
- జాతి ఆత్మగౌరవం కోసం ఐక్యంగా కదలాలి.. మరిపెడ మండల తండాల్లో విస్తృత ప్రచారం



**నేటి సాక్షి, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా, డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండల పరిధిలోని మేకల తండా, బోడ చంద్రు తండాలలో గోర్ మాటి ఆత్మగౌరవ సదస్సుకు సంబంధించిన గోడ పత్రికలను (పోస్టర్లను) గురువారం ఘనంగా ఆవిష్కరించారు. మాకుల తండాలో త్వరలో నిర్వహించనున్న భావసంగ్ మహారాజ్ కల్యాణం మరియు బండ్లు తిరిగే కార్యక్రమానికి జాతి ప్రజలు భారీ సంఖ్యలో హాజరు కావాలని, అదే రోజు జరిగే ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త జాదవ్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డోర్నకల్ నియోజకవర్గ ఇంచార్జ్ బానోత్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ.. భావసంగ్ మహారాజ్ పేరును ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదని, మ్యారమా భవానీ పేరు మీద ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా శిలాఫలకాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జాతి ప్రజలందరూ ఐక్యంగా ముందుకు వచ్చి ఈ సదస్సును సక్సెస్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రు తండా సర్పంచ్ చంద్రు నాయక్, మాజీ సర్పంచ్ మంచ్యా నాయక్, సేవలాల్ మహారాజ్ పూజారి బాలబోడ్లు, రవి నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్గంపల్లిలో చలివేంద్రం ప్రారంభం

- దాహార్తికి చల్లని నీడ. మాజీ మంత్రి రెడ్యా నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరణ.. 10 ఏళ్లుగా కొనసాగుతున్న సేవలు
- గాలి ఆశ జ్ఞాపకార్థం బాల వికాస సంస్థ సేవా స్ఫూర్తి.. పండ్ల పంపిణీ చేసిన నిర్వాహకులు




**నేటి సాక్షి, మహబూబాబాద్:** వేసవి కాలంలో బాటసారులు, స్థానిక ప్రజల దాహార్తిని తీర్చేందుకు మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూర్ మండలం ఉగ్గంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, గాలి ఆశ జ్ఞాపకార్థం గత పదేళ్లుగా నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి డి.ఎస్. రెడ్యా నాయక్ చలివేంద్రాన్ని ఆవిష్కరించి, సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రెడ్యా నాయక్ మాట్లాడుతూ.. సమాజ హితం కోసం, ప్రజల అవసరాల కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చలివేంద్రం ప్రారంభం అనంతరం గాలి ఆశ జ్ఞాపకార్థం ప్రజలకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అయూబ్ పాషా, ఉప సర్పంచ్ అరుణపట్టయ్య, వార్డు సభ్యులు భర్తపురం కొమురెల్లి, నూకల గంగరాజు, ముత్యం సత్యనారాయణ, గూగులోతు యాకి నాయక్, మునిగేటి మల్లయ్య, దోమల నవీన్ మరియు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# పాములపాడులో కూటమి శ్రేణుల సంబరాలు



**నేటి సాక్షి, పాములపాడు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో బిల్లును ఆమోదించిన నేపథ్యంలో పాములపాడు మండల కేంద్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు ఘనంగా సంబరాలు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇంచార్జ్ శివానంద రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు అమరావతికి మద్దతుగా కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగాల నాగరాజు, టీడీపీ యువ నాయకులు కరీం బాషా మాట్లాడుతూ.. 11 పార్టీల భాగస్వామ్యంతో, 10 పార్టీల సంపూర్ణ మద్దతుతో అమరావతిని ఏకైక రాజధానిగా కేంద్రం చట్టబద్ధం చేయడం చారిత్రాత్మకమని కొనియాడారు.

- **ఏపీ ఏకైక రాజధానిగా అమరావతి**
  **అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై హర్షం. కొవ్వొత్తుల ప్రదర్శనతో మద్దతు**
- **రాష్ట్ర భవిష్యత్తుకు ఇది శుభసూచకం. లోక్‌సభ ఆమోదంపై టీడీపీ నేతల ధీమా**

ఇది రాష్ట్ర భవిష్యత్తుకు శుభసూచకమని సహకార సంఘం చైర్మన్ రాయపాటి గోవిందు పేర్కొన్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో ఏపీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేసీ కెనాల్ డీసీ మద్దూరు తిమ్మారెడ్డి, మండల నాయకులు కృష్ణయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మోహన్ గౌడ్, వేంపెంట సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. అలాగే ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రవీంద్ర, రాయపాటి మల్లికార్జున, శేఖర్ బోగల్ల, కే.నరసింహ, ఎం.శేఖర్, కే.అశోక్, రామకృష్ణ, రాజు, రవి, అన్సర్ బాషా తదితరులు పాల్గొని సంబరాల్లో పాలుపంచుకున్నారు.




# మూగబోయిన ఉద్యమ గొంతుక

## ప్రజా కళాకారుడు జహంగీర్ కన్నుమూత

**మెతుకు సీమతో మూడు దశాబ్దాల అనుబంధం.. ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం**

**తెలంగాణ జనసభ ఆవిర్భావంలో కీలక పాత్ర.. కళా సమితి రాష్ట్ర బాధ్యతల్లో సేవలు ..సామాజిక రుగ్మతలపై సమరం.. పల్లె పల్లెనా కాలికి గజ్జె కట్టి సాగిన పోరాట ప్రస్థానం. జహంగీర్ మృతికి నందిని సిద్ధారెడ్డి, దేశపతి శ్రీనివాస్ సహా పలువురు ప్రముఖుల సంతాపం**





**నేటి సాక్షి, జగదేవ్‌పూర్:** దశాబ్దాల కాలం పాటు తన గొంతుకతో ప్రజలను ఉర్రూతలూగించి, సామాజిక సమస్యలపై సమరం చేసిన ప్రముఖ సారథి కళాకారుడు జహంగీర్ గుండెపోటుతో కన్నుమూశారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లికి చెందిన జహంగీర్, తన సొంత జిల్లా కంటే సిద్దిపేట జిల్లా (మెతుకు సీమ)తోనే విడదీయలేని అనుబంధాన్ని ఏర్పరుచుకున్నారు. జగదేవ్‌పూర్ మండలంతో పాటు జిల్లాలోని వందలాది గ్రామాల్లో తన కళా ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్య పరిచారు. వామపక్ష భావజాలంతో పెరిగిన ఆయన, చిన్నతనం నుంచే పాటల ద్వారా సమాజంలోని అన్యాయాలను ప్రశ్నిస్తూ గొప్ప కళాకారుడిగా ఎదిగారు. జహంగీర్ కేవలం వినోదం కోసం కాకుండా, సామాజిక మార్పు కోసం తన కళను ఆయుధంగా మలుచుకున్నారు. కుల వివక్ష, బాలకార్మిక వ్యవస్థ, వరకట్న వేధింపులు, గృహహింస వంటి రుగ్మతలపై ప్రజలను జాగృతం చేశారు. రైతులు, హమాలీలు, బీడీ కార్మికులు మరియు వలస కూలీల సమస్యలపై తన ఆటపాటలతో పాలకులను నిలదీశారు. గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట ప్రాంతాల్లో ఆయన నిర్వహించిన 'దొర జీతగాడు' నాటక ప్రదర్శనలు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశాయి. జగదేవ్‌పూర్‌లోని 'పీస్' స్వచ్ఛంద సంస్థతో కలిసి వయోజన విద్య, అక్షరాస్యతపై విశేష కృషి చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లడంలో జహంగీర్ పాత్ర మరవలేనిది. తెలంగాణ జనసభ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, తెలంగాణ కళా సమితి రాష్ట్ర బాధ్యతలను నిర్వహించారు. దివంగత బెల్లి లలితతో కలిసి ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక సభలు, సమావేశాలను నిర్వహించి ఉద్యమ జ్వాలను రగిలించారు. జహంగీర్ మృతి వార్త తెలియగానే సాహిత్య, రాజకీయ, జర్నలిజం రంగాలకు చెందిన ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, టీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, సిపిఐ నాయకులు బట్ట దయానంద రెడ్డి తదితరులు ఆయన మృతికి సంతాపం తెలిపారు. జహంగీర్ మరణం మెతుకు సీమ ప్రజా పోరాటాలకు తీరని లోటని వారు పేర్కొన్నారు. కళాకారులు షేక్ బాబా, అక్కారం సత్తయ్య తదితరులు తమ సహచర కళాకారుడికి అశ్రునివాలి అర్పించారు.

# వీర హనుమాన్ శోభాయాత్ర

**సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు**



**నేటి సాక్షి కొమురం భీం ఆసిఫాబాద్ :** కాగజ్ నగర్ పట్టణంలోని పాత హనుమాన్ మందిరం నుండి పట్టణ పుర వీధుల గుండా ఈ రోజు హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా హిందూ జాగరన్ మంచ్ ఆధ్వర్యంలో వేలాది భక్తులతో కూడిన గొప్ప శోభాయాత్ర నిర్వహించడం జరిగింది. సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు శ్రీరాముని మరియు హనుమంతుని విగ్రహాలకు తొలి పూజ నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమంతుని కృప వలన మన ప్రాంతం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం రాజీవ్ గాంధీ చౌక్ వద్ద భక్తులకు భారతీయ జనతా పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు మామిడి పండ్ల రసాలను పంపిణీ చేయడం జరిగింది.

# రైస్ మిల్లుల ముసుగులో దందా



**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్ :** కాగజ్ నగర్ పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం దారి మళ్లుతోంది. రైస్ మిల్లులే కేంద్రంగా సాగుతున్న అక్రమ బియ్యం రవాణా బాగోతం ఎట్టకేలకు వెలుగులోకి వచ్చింది. కాగజ్ నగర్ పరిసర ప్రాంతాల్లోని రైస్ మిల్లులపై పోలీసులు నిర్వహించిన ఆకస్మిక దాడులు స్థానికంగా సంచలనం సృష్టించాయి. సిర్పూర్ ఎస్సై డి. సాగర్ నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ బృందం బుధవారం అర్ధరాత్రి వేంపల్లిలోని 'దుర్గా భవానీ' రైస్ మిల్లుపై మెరుపు దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో మిల్లు ఆవరణలో అక్రమంగా నిల్వ ఉంచిన 09 క్వింటాళ్ల పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలింపు: స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి విచారణ నిమిత్తం సిర్పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఏప్రిల్ నెలలో మూడు నెలల రేషన్ బియ్యం వస్తుందని ఒకటో తారీకు నుండి దందా మొదలు పెట్టినారు రేషన్ బియ్యం పట్టణంలో చిల్లర వ్యాపారుల దగ్గర నుండి రేషన్ డీలర్ల వరకు కొనుగోలు జరుగుతుంది ఈ దాడుల సమయంలో ఒక విచిత్రమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు రాకముందే భారీ మొత్తంలో బియ్యంతో ఉన్న ఒక వాహనం అక్కడి నుండి క్షణాల్లో మాయమవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టుబడిన బియ్యం సంచులపై ప్రభుత్వ గోదాముల ముద్రలు ఉండటం గమనార్హం. అంటే, ఈ బియ్యం నేరుగా ఎం.ఎల్.ఎస్ పాయింట్ల నుంచో లేదా డీలర్ల నుంచో మిల్లుకు చేరినట్లు స్పష్టమవుతోంది.ఎన్ని సార్లు పట్టుబడ్డ మిల్లర్లు మాత్రం ఎవరికి భయపడేది లేదని సుష్టమవుతుంది దీనిపై ఉన్నత అధికారులు గట్టి నిగా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు రైస్ మిల్ యజమానిపై పీడీ యాక్ట్' ప్రయోగించాలి ప్రభుత్వం మరియు మీడియా ఎన్ని హెచ్చరికలు జారీ చేస్తున్నా, రైస్ మిల్లు యజమానుల ఆగడాలు తగ్గడం లేదు. ఇంత సాహసంగా దందా చేస్తున్నారంటే వీరి వెనుక ఉన్న 'పెద్దల' హస్తం ఎవరిదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# అకాల వర్షాలతో పంట నష్టం

**తక్షణ పరిహారం చెల్లించాలని బీజేపీ డిమాండ్**



**నేటి సాక్షి, ఎండపల్లి:** ఇటీవల కురిసిన అకాల వర్షాలు ఎండపల్లి మండలంలోని గొడిశెలపేట గ్రామ రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. కోత దశకు వచ్చిన మొక్కజొన్న పంటలు ఒక్కసారిగా కురిసిన వర్షానికి నేలకొరగడంతో రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొమ్ము రాంబాబు గ్రామాన్ని సందర్శించి, దెబ్బతిన్న పంటలను స్వయంగా పరిశీలించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్న ఆయన.. భారీ పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో వర్షార్పణం కావడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణమే పరిహారం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అకాల వర్షాలతో తాము పెట్టిన పెట్టుబడి కూడా దక్కేలా లేదని, అధికారులు త్వరగా స్పందించి ఆదుకోవాలని గొడిశెలపేట గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737



# అమరావతిని రైతులకోసం అంకితం



నేటి సాక్షి,నందికొట్కూరు: నందికొట్కూరు నియోజకవర్గంలో ఈరోజు నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్యవారు నందికొట్కూరు పట్టణంలో కూటమి నాయకులతో కలిసి తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకుమరియు అంబేద్కర్ విగ్రహం దగ్గర ఎమ్మెల్యే పూల మాలవేసి కొవ్వొత్తులతో జాతీయ జెండాతో జై అమరావతి అంటూ ర్యాలీ నిర్వహిస్తూ ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి పార్లమెంటు వేదికగా చట్టబద్ధత లభించడం ఐదు కోట్ల ఆంధ్రుల కల నెరవేరిన అద్భుత ఘట్టం అన్నారు. భూములిచ్చిన రైతుల మహా త్యాగాలకు శిరస్సు వంచి నమస్కరిస్తూ ఈ విజయాన్ని రాష్ట్ర అంతటా ఒక పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. అమరావతి కేంద్రంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్న కూటమి ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ప్రతి గడపకూ చేరవేయడమే ఈ వేడుకల ప్రధాన లక్ష్యం అన్నారు సందర్భంగా: ఎమ్మెల్యే గిత్త జయసూర్య వారు

- చంద్రబాబునాయుడు గారికి కృతజ్ఞతలు: ఎమ్మెల్యే గిత్త జయసూర్య

మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ విషయంలో పెద్దన్నలా అండగా ఉండి సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపారు. పార్లమెంటు ఉభయ సభల్లో రాజధాని బిల్లు ఆమోదం పొందడంతో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ, ఇందుకు సహకరించిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజును మర్యాదపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కుట్రలు, అవాంతరాలను అధిగమించి రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత లభించిన నేపథ్యంలో.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా, ప్రపంచ శ్రేణి నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నానని అన్నారు.



కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనడం జరిగినది.

## వాటర్ ప్యూరిఫైర్ ప్రారంభం



నేటి సాక్షి, తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని అంగన్వాడీ కేంద్రంలో కార్పొరేటర్ కాల్వ మల్లేశం వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ సింగిరెడ్డి స్వామి రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సల్ల మహేందర్, మాజీ ఎంపీటీసీ సిరిసిల్ల అంజయ్య, యూత్ అధ్యక్షులు దీపక్, దాసం కమలాకర్, తొర్తి ప్రశాంత్, పరాంకుశం చందు, సిల్ల పరుశరాములు, రేశవేని వేణు యాదవ్, లంక రవి,ముంజ సంపత్, బుర్ర చందు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## గడ్డి మందు పై నిషేధం



నేటి సాక్షి:చెన్నూర్ చెన్నూరు మండలంలో పారాక్వాట్ గడ్డి మందు అమ్మకాలు వినియోగంపై పూర్తి నిషేధం ఈ రోజు నుండి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పారాక్వాట్ డైక్లోరైడ్ 24% SL (Paraquat Dichloride) అనే గడ్డి మందును పర్యావరణ ప్రజల ఆరోగ్య దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా నిషేధించడం వలన ఈ నేపథ్యంలో మన మండలంలోని పలు పెస్టిసైడ్ దుకాణాల యందు ఉన్న పారాక్వాట్ గడ్డి మందు పై స్టాప్ సేల్ చేసాం కావున చెన్నూర్ మండలంలోని ఉన్న రైతులు, పురుగుమందుల డీలర్లు ఈ క్రింది సూచనలను తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయ అధికారి యామిని తెలియజేశారు.

## గున్ముకుల గ్రామంలో గ్రామ సభ



నేటి సాక్షి నారాయణపేట(ఇమామ్ సాబ్ ): నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల గున్ముకుల గ్రామంలో గురువారం గ్రామసభ సమావేశానికి హాజరైన ముఖ్యులు గ్రామ సర్పంచ్ అనంతమ్మ హైపి రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ నరసింహులు , గ్రామ వార్డు సభ్యులు మండల సూపర్నెంట్, మండల రెవెన్యూ ఆఫీస్ గెద్దావరి తదితర డిపార్ట్మెంట్ నుంచి విచ్చేసిన అధికారులు రావడం జరిగింది. గ్రామ పెద్దలు గ్రామ యువకులు గ్రామ సంఘాల అధ్యక్షురాలు మహిళ పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఈ గ్రామ సభలో గ్రామ సమస్యలు పై గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ అధికారులకు తెలియజేయడం జరిగింది. 359 సర్వే నంబర్లు పాఠశాలలో అనేక సమస్యల మీద సర్వే నెంబర్ 360 లో రోడ్ల సమస్యలు డ్రైనేజీ సమస్యలు మా గ్రామం తరపు నుంచి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. గ్రామ కంఠంలో ఉన్నటువంటి ఇంటర్నల్ రోడ్లు ఆక్రమించుకున్న సమస్యలపై డ్రైనేజీలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.గ్రామ నిబంధనల ప్రకారం గా ఇంటి నిర్మాణానికి పర్మిషన్ తీసుకొని ఇల్లు నిర్మాణం చేసుకోవాలని చేసుకోవాలని గ్రామసభలు టాపి మేస్త్రీల సంఘానికి గ్రామస్తులకు సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామసభలో తెలియజేసి తీర్మానం చేయడం జరిగింది.కొన్ని అంశాలపై తీర్మానాలు చేయడం జరిగింది. గ్రామ అభివృద్ధికి గ్రామ పెద్దలు గ్రామ యువకులు మహిళలు సహకరించాలని కోరారు.

## లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

### ఆడ శిశువుల సంరక్షణ అందరి బాధ్యత.. జిల్లా ఎస్పీ



నేటి సాక్షి, కుమురం భీం ఆసిఫాబాద్ (ఎండి ముబీన్): జిల్లాలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ (Se.Determination), లింగ ఎంపిక (Se. Selection) వంటి చట్టవిరుద్ధ చర్యలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్ ఐపీఎస్ హెచ్చరించారు. ఈ మేరకు PCPNDT చట్టం-1994ను జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గర్భంలోని శిశువు లింగాన్ని తెలుసుకోవడం లేదా వెల్లడించడం వంటి చర్యలు సమాజానికి ముప్పుగా మారుతున్నాయని, ముఖ్యంగా ఆడ శిశువుల జనాభా తగ్గుదలకు ఇవి కారణమవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని అల్ట్రాసౌండ్, స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, నిబంధనలు పాటించని పక్షంలో నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. చట్టం ప్రకారం మొదటిసారి నేరానికి పాల్పడితే 3 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తారని.. నేరం పునరావృతమైతే 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 50 వేల జరిమానా ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా సంబంధిత డాక్టర్లు, వైద్య సిబ్బంది మెడికల్ లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. జన్యు లోపాలు, శిశువు ఆరోగ్య స్థితిగతులను గుర్తించేందుకు మాత్రమే ప్రీ-నేటల్ పరీక్షలకు అనుమతి ఉంటుందని, అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ చేయకూడదని ఎస్పీ వివరించారు. జిల్లాలో ఎక్కడైనా ఇటువంటి అక్రమ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670581కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఆడపిల్లల సంరక్షణ, లింగ సమానత్వం కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

# చర్లపల్లి ప్రజాపాలన గ్రామసభ రసాభాస





నేటి సాక్షి, ఎండపల్లి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఎండపల్లి మండల వ్యాప్తంగా గురువారం నిర్వహించిన గ్రామసభలు సాధారణంగా ప్రశాంతంగా సాగాయి. అయితే చర్లపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభ మాత్రం ఉద్రిక్త వాతావరణంలో సాగి చర్చనీయాంశంగా మారింది. సమావేశం తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభించి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వివరించారు. రైతు భరోసా, గ్యాస్ సబ్సిడీ, ఆసరా పింఛన్ వంటి అంశాలు చర్చకు రావడంతో ప్రతిపక్ష నేతలు స్పందించారు. గ్రామంలో అర్హులందరికీ పథకాలు అందడం లేదని, లబ్ధిదారుల ఎంపికలో లోపాలు ఉన్నాయని ఆరోపించారు. దీనికి అధికార పార్టీ నాయకులు ప్రతిస్పందించడంతో వాదోపవాదాలు తీవ్ర స్థాయికి చేరి సమావేశం ఉద్రిక్తంగా మారింది. కొంతసేపు సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

- అధికార ప్రతిపక్ష నేతల మధ్య వాగ్వాదం
- గ్రామ పెద్దల జోక్యంతో సమావేశం కొనసాగింపు

పరిస్థితిని గమనించిన గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అనంతరం గ్రామ కార్యదర్శి తిరుపతి రెడ్డి ప్రజాపాలన ప్రగతి నివేదికను కొనసాగిస్తూ గ్రామానికి అందిన సంక్షేమ పథకాల వివరాలను చదివి వినిపించి, అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా తమకు లబ్ధి చేకూరిందని కృతజ్ఞతలు తెలిపారు. కాగా సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్పంచ్ మాట్లాడకపోవడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుడు పడిదం వెంకటేష్, బీజేపీ మండల మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు సిగిరి ఆనంద్, గ్రామ రెండవ వార్డు సభ్యుడు జెల్ల శ్రీనివాస్ ప్రతిపక్ష హోదాలో సభలో ప్రభుత్వ పథకాల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. అధికార ప్రతినిధులు సరైన సమాధానాలు ఇవ్వకుండా సభను తప్పుదోవ పట్టించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడిదం లావణ్య, ఉప సర్పంచ్ అల్లం తిరుపతి, వార్డు సభ్యులు సిగిరి నాగేష్, అర్చన, లత, అధికారులు ఐకేపి సీసీ శ్రీనివాస్, ఏఎన్ఎం సునీత, పాఠశాల ఉపాధ్యాయులు సత్యం, నాయకులు జక్కుల మహేష్, మారుతి, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, డీలర్ తిరుపతి, సీఏ మల్లీశ్వరి, ఆశా వర్కర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో వైభవంగా హనుమాన్ శోభాయాత్ర





- వీర హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు.. శోభాయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్సీ
- హిందూ జాగరణ్ సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కోలాహలం.. భక్తుల జయజయధ్వానాలు
- వేసవి దృష్ట్యా భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ.. సేవా కార్యక్రమాల్లో కాంగ్రెస్ శ్రేణులు
- పాల్గొన్న మాజీ చైర్మన్ దస్తగిరి, వార్డు కౌన్సిలర్లు.. భారీ బందోబస్తు మధ్య సాగిన యాత్ర

నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. పట్టణంలోని ప్రసిద్ధ వీర హనుమాన్ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిందూ జాగరణ్ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ శోభాయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధులన్నీ 'జై శ్రీరామ్', 'జై హనుమాన్' నినాదాలతో మారుమోగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శోభాయాత్రలో పాల్గొన్న భక్తుల సౌకర్యార్థం పలుచోట్ల అన్నదాన, పానీయాల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తులకు పులిహోర మరియు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీతో పాటు కాంగ్రెస్ పార్టీ మాజీ చైర్మన్ దస్తగిరి, స్థానిక వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హిందూ జాగరణ్ సమితి సభ్యులు శోభాయాత్రను క్రమబద్ధంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. హనుమంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.